
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	గురువారం	శుక్రవారం
కర్నూలు	6:34	5:00
నంద్యాల	6:31	5:00



ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీ

తొలి స్థానంలో ఆదోని మార్కెట్

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు రికార్డు స్థాయి ఆదాయం సమకూరింది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని మించి 105 శాతాన్ని సముపార్జించింది. 2024-25 అర్థిక సంవత్సరానికి రూ.17.10 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించగా మార్చి 15 నాటికే రూ.17.20కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి రాయలసీమ జిల్లాల్లోని మార్కెట్ కమిటీలలోనే ఆదాయపు వసూళ్ల లక్ష్యాన్నిమించి అగ్రశ్రేణిగా నిలిచింది. ఈ లెక్కన ప్రత్యక్షంగా రూ.1720 కోట్ల లావాదేవీలు జరిగాయి. రాష్ట్రంలోని గుంటూరు మార్కెట్ తర్వాత ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీకి అంత ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆదోని అగ్రికల్చర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు జిల్లా రైతులే కాక పక్క జిల్లాలైన అనంతపురం, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి నిత్యం వేల మంది రైతులు విక్రయానికి తెచ్చిన పంట ఉత్పత్తులతో కళకళలాడుతుంటుంది. ఉమ్మడి జిల్లాలో 14 మార్కెట్ కమిటీలు ఉండగా ప్రధానంగా ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులు రెగ్యులేటెడ్ కమిటీలు 2024-25 కర్నూలు జిల్లాకు రూ.36.14 కోట్లు ఆదాయపు వస్తువుల లక్ష్యాన్ని నిర్దేశించగా ఇప్పటి వరకు రూ.36.81 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో సగంపైగా ఆదోని మార్కెట్ యార్డ్ నుంచే ఆదాయం వచ్చింది. మిగతా మార్కెట్ కమిటీలు కర్నూలు, ఎమ్మిగనూరుతో పాటు చెక్ పోస్టులు వారపు సంత జరిగే ఆలూరు, కోసిగి, పత్తికొండ, కోడుమూరు మార్కెట్ కమిటీల నుంచి వచ్చాయి.



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

- రాయలసీమ జిల్లాల్లో రికార్డు స్థాయిలో ఆదాయం
- సెస్సు రూపంలో రూ. 17.20 కోట్లు

అంతా తెల్ల బంగారమే

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 2024 ఏప్రిల్ నుంచి ఈ ఏడు మార్చి 15 నాటి వరకు పత్తి 6,46,460 క్వింటాళ్లు విక్రయానికి వచ్చాయి. వాటి కనిష్ఠ ధర క్వింటం రూ.3960 కాగా గరిష్ఠ ధర రూ.8260 పలకగా వేరుశనగ 2,45,112 క్వింటాళ్లు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.3016, గరిష్ఠ ధర రూ.7488 పలికింది. ఆముదాలు 50,591 క్వింటాళ్లు రాగా వాటి కనిష్ఠ ధర 2000, గరిష్ఠ ధర 6,150 పలికింది. పొద్దుతిరుగుడు 552 క్వింటాళ్లు కంది, వాము, పప్పుసెనగ దిగుబడులు కూడా వచ్చాయి. ఇందులో ప్రధానంగా పత్తి దూది, గింజలు నుంచి రూ.13కోట్లు వరకు సెస్సు రూపంలో ఆదాయం సమకూరింది. నిర్దేశించిన లక్ష్యంలో 70 శాతం తెల్ల బంగారం నుంచే మార్కెట్ కమిటీకి ఆదాయం వచ్చింది.

సమష్టి కృషితోనే లక్ష్యానికి మించి ఆదాయం



ప్రకృతి వైపరీత్యాలు ఉన్నప్పటికీ 2024-25 ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయపు వసుళ్ళ లక్ష్యాన్ని పక్కా ప్రణాళికతో సాధించగలిగాం. ఎప్పటికప్పుడు వ్యాపారుల జరిపిన లావాదేవీల నుంచి 1శాతం సెస్సు రాబట్టుకున్నాము. వ్యాపారులు కూడా మాకు సహకరించారు. మొండి బకాయిలపై దృష్టి పెట్టి వసూలు చేశాం. దీంతో నిర్దేశించిన లక్ష్యాన్ని మించి అధికంగా మార్కెట్ కమిటీకి ఆదాయాన్ని సమకూర్చాం.

- రామ్మోహన్ రెడ్డి, సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి, ఆదోని



గత ఐదేళ్లలో ఆదోని మార్కెట్ యార్డ్ సమకూర్చిన ఆదాయం వివరాలు

ఏడాది	లక్ష్యం	వసూళ్లు
2020-21	రూ.1200	849.48
2021-22	రూ.1503	1608.5
2022-23	రూ.1600	1248.5
2023-24	రూ.1610	1416.9
2024-25	రూ.1710	1720

విక్రయానికి వచ్చిన వేరుశనగ దిగుబడులు



22న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాక



కర్నూలు కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ నెల 22న జిల్లాకు రానున్నారు. ఈ సందర్భంగా పకడ్బందీగా చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలో డిప్యూటీ సీఎం పర్యటన సందర్భంగా ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా రాబోయే జూన్‌లోపు రెండు లక్షల ఫారమ్‌పాండ్‌లను పూర్తి చేయాలన్న లక్ష్యంతో నిర్మిస్తున్న సందర్భంగా జిల్లాలో డిప్యూటీ సీఎం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారనీ పేర్కొన్నారు. జిల్లాలో 8,500 ఫారమ్ పాండ్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామ పరిధిలో ఫారమ్ పాండ్స్‌కు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భూమి పూజ చేస్తారని తెలిపారు. తొలుత ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకుని అనంతరం పూడిచెర్లలలో ఫారమ్ ఫాండ్‌కు భూమి పూజ చేస్తారని, తదుపరి బహిరంగ సభలో డిప్యూటీ సీఎం పాల్గొంటారని పేర్కొన్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు పూర్తి కావాలని కలెక్టర్, కర్నూలు ఆర్డీవో జడ్పీ సీఈవో, డ్వామా పీడీ, ఆర్అండ్‌బీ ఎస్ఈ, డీఆర్‌డీఏ పీడీ మెప్మా, డీఎస్పీ, జడ్పీ సీఈవో ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్, ఓర్వకల్లు తహసీల్దార్, ఎంపీడీవోలను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో సౌకర్యాలు కల్పించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కర్నూలు న్యూసిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ డిమాండ్ చేశారు. కర్నూలు నగర శివారులో నిర్మించిన టిడ్కో గృహాలను బుధవారం పరిశీలించి అక్కడ నివాసం ఉంటున్న ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2017లో టీడీపీ హయాంలో రూ.575 కోట్లతో కర్నూలు నగరంలో సుమారు 10,400 గృహాలు నిర్మించారని, 90 శాతం పనులు పూర్తి అయ్యాయని అన్నారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. గృహాలకు నీటి వసతి, డ్రైనేజీ, రవాణా సౌకర్యం లేదని, అయితే ఇంటి అద్దె చెల్లించలేని సుమారు 130 మంది పేద కుటుంబాలు వారికి కేటాయించిన గృహాల్లో నివాసం ఉంటున్నాయని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికే రూ.500 కోట్లు ఖర్చు చేసిందని, మరో రూ.100 కోట్లు ఖర్చు చేస్తే గృహాలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించవచ్చన్నారు. అనంతరం టిడ్కో అధికారి రవికుమార్ గుప్తాతో మాట్లాడి గృహాలలో కనీస సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప, సీనియర్ నాయకులు కె. జగన్నాథం, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శులు సి.మహేష్, శ్రీనివాసరావు, బీసన్న, శరత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మిర్చి ధర భారీగా పతనం

- క్వింటం గరిష్ఠం రూ.10,206

ఆదోని అగ్రికల్చర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఎండుమిర్చి ధరలు భారీగా పతనమయ్యాయి. బుధవారం ఎండుమిర్చి ధర క్వింటం గరిష్ఠంగా రూ.10,206 పలికింది. గత వారంతో పోల్చితే ఎండుమిర్చి ధర క్వింటానికి రూ.3వేలకు పైగా ధర పతనమైంది. కర్ణాటక రాష్ట్ర బ్యాడిగి మార్కెట్, గుంటూరు మిర్చి మార్కెట్‌లోను ధరలు భారీగా పతనమైనట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. మరోవైపు దిగుబడులు భారీగా రావడం ఎగుమతులు లేకపోవడమే ధరలు తగ్గడానికి కారణమని చెబుతున్నారు. మిర్చి సాగు చేసిన రైతులు ఎకరాలకు రూ.లక్షన్నరకు పైగా సాగు పెట్టుబడి ఖర్చులు పెట్టామని, పెరిగిన ఎరువులు, విత్తనాలు, మిర్చి కోత కూలీలు తడిసి మోపెడవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పలుకుతున్న ధర వల్ల తమకు కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేక అప్పుల పాలవుతున్నామని వాపోయారు. 2057 బస్తాల ఎండుమిర్చిని రైతులు విక్రయానికి రాగా క్వింటం కనిష్ఠ ధర రూ.2009, గరిష్ఠ ధర రూ.101206, మధ్య ధర రూ.8300 పలికింది.



స్థానిక ఖాళీలకు ఎన్నికలు..!

- తుగ్గలి, వెల్దుర్తి ఎంపీపీలు ఆదెమ్మ, సరళ రాజీనామాతో ఖాళీ
- మృతి చెందిన జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్
- ఖాళీగా ఆరు ఉప సర్పంచ్ స్థానాలు
- నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- 27న ప్రత్యేక సమావేశం.. అదే రోజు ఎన్నికలు

వివిధ కారణాలతో ఖాళీ అయిన మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ), ఉప సర్పంచులు, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుల స్థానాల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలో రాజకీయ ఒప్పందంలో భాగంగా తుగ్గలి, వెల్దుర్తి ఎంపీపీలు రాజీనామా చేశారు. జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్ ఆనారోగ్యంతో మరణించారు. ఆరు పంచాయతీల ఉప సర్పంచ్ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. షెడ్యూల్‌లో భాగంగా ఈ నెల 23న సభ్యులకు నోటీసులు జారీ చేస్తారు. 27న జరిగే ప్రత్యేక సమావేశంలో మెజార్టీ సభ్యుల ఆమోదంతో ఎంపీపీ, ఉప సర్పంచులను ఎన్నుకుంటారు. పత్తికొండ నియోజకవర్గంలో రాజీనామాలతో ఖాళీ ఏర్పడిన రెండు ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి రావడంతో రాజకీయ వేడి రాజుకుంది. రాజకీయ ఒప్పందంలో భాగంగా రాజీనామా చేసినా.. వెల్దుర్తి ఎంపీపీ పీఠం కోసం వైసీపీలో పోటీ పడుతుండడంతో క్యాంపు రాజకీయాలకు తెరతీసే అవకాశం లేకపోలేదు.

కర్నూలు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు 2020 మార్చిలో జరగాల్సి ఉంటే.. కరోనా కారణంగా వాయిదా పడడంతో 2021 ఆగస్టులో జరిగాయి. సెప్టెంబరులో జడ్పీ, ఎంపీపీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. అప్పటి అధికార వైసీపీ నాయకుల అక్రమాలు, దౌర్జన్యాలను నిరసిస్తూ.. నాటి ప్రధాన ప్రతిపక్షం టీడీపీ ఆ ఎన్నికలను బహిష్కరించింది. పలు స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో స్థానిక నాయకులు పోటీ చేసినా.. అధికార బలం, పోలీసులతో భయపెట్టి తమకు అనుకూలంగా మార్చుకున్నారు. దీంతో మెజార్టీ స్థానాలను వైసీపీ దక్కించుకుంది. పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి, వెల్దుర్తి మండలం పరిషత్ అధ్యక్ష పీఠాలను నాడు వైసీపీ తమ ఖాతాలో వేసుకుంది. అయితే.. ఈ పదవి కోసం ఆ పార్టీలోనే ఇద్దరు నాయకుల మధ్య పోటీ ఉండడంతో అప్పటి ఎమ్మెల్యే శ్రీదేవి చెరో రెండున్నర ఏళ్ల ప్రకారం పదవీ కాలాన్ని పంచుకున్నారు. ఆ ఒప్పందంలో భాగంగా మొదటి ఎంపీపీ పీఠంపై కూర్చున్న తుగ్గలి ఎంపీపీ ఆదెమ్మ, వెల్దుర్తి ఎంపీపీ బొమ్మన సరళ ఒప్పందం మేరకు రాజీనామా చేశారు. ప్రస్తుతం ఆ మండలాల్లో వైఎస్ ఎంపీపీలు ఇన్‌చార్జి ఎంపీపీలుగా కొనసాగుతున్నారు. బుధవారం నోటిఫికేషన్ రావడంతో ఒప్పందం ప్రకారం పోటీ పడిన రెండో ఎంపీటీసీ సభ్యుడికే ఇస్తారా..? మరో ఎంపీటీసీని ఎంపీపీ పీఠంపై కూర్చోపెడతారా..? అనేది వైసీపీలో చర్చగా మారింది. అయితే.. సంఖ్యా బలం లేకపోవడంతో వైసీపీలో ఏం జరుగుతుందో చూద్దాం..! అంటూ అధికార టీడీపీ ముఖ్యనాయకులు వేచి చూస్తున్నారు.

మళ్లీ పీఠం ఆశిస్తున్న వెల్దుర్తి మాజీ ఎంపీపీ సరళ

వెల్దుర్తి మండల పరిషత్ అధ్యక్ష పీఠం జనరల్ మహిళకు రిజర్వు చేశారు. 17 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 2021 ఆగస్టులో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలను నాటి ప్రతిపక్ష టీడీపీ బహిష్కరించినా.. స్థానిక టీడీపీ నాయకులు పలు స్థానాలకు పోటీ చేసి నాడు వైసీపీ దౌర్జన్యాలను ఎదురొడ్డి మూడు స్థానాల్లో విజయం సాధించారు. 14 స్థానాలను వైసీపీ దక్కించుకుంది. నాడు ఎంపీపీ పీఠం కోసం వైసీపీ మండల కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి భార్య వెల్దుర్తి-3 ఎంపీటీసీ సభ్యురాలు బొమ్మన సరళ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు, వైసీపీ నాయకుడు దేశాయి సమీర్‌కుమార్‌రెడ్డి తల్లి లక్ష్మీదేవి పోటీ పడ్డారు. రాజకీయ ఒప్పందంలో భాగంగా మొదట రెండున్నరేళ్లు బొమ్మన సరళ ఎంపీపీ పదవిలో కొనసాగారు. రెండున్నర ఏళ్లు పూర్తయిన తరువాత ఒప్పందంలో భాగంగా ఆమె రాజీనామా చేశారు. ప్రస్తుతం వైఎస్ ఎంపీపీ రంగయ్య ఇన్‌చార్జి ఎంపీపీగా ఉన్నారు. 27న జరిగే ఎంపీపీలో ఎన్నికల్లో ఒప్పందం ప్రకారం మాజీ జడ్పీటీసీ సభ్యుడు దేశాయి సమీర్‌కుమార్‌రెడ్డి తల్లి ఎల్. నగరం ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఉంది. అయితే.. మరోసారి ఎంపీపీ పీఠం తన భార్య సరళకే ఇవ్వాలని వైసీపీ మండల కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి పోటీ పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై ఇప్పటికే పత్తికొండ వైసీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవితో చర్చించినట్లు ఆ పార్టీలో ప్రధానంగా చర్చ జరుగుతున్నది. అదే జరిగితే ఎంపీపీ పీఠం కోసం పోటీ అనివార్యం అవుతుంది. ముగ్గురు టీడీపీ ఎంపీటీసీ సభ్యుల మద్దతు కీలకంగా మారే అవకాశం ఉంది.

మిగతా 7వ పేజీలో



రామాంజినమ్మ | ఆదెమ్మ | లక్ష్మీదేవి | బొమ్మన సరళ | తుగ్గలి మండల పరిషత్ కార్యాలయం

మధ్యవర్తిత్వంపై ముఖాముఖి



జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది ఆధ్వర్యంలో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శిక్షకులు

కర్నూలు లీగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో మధ్యవర్తిత్వం అనే అంశంపై న్యాయాధికారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణా కార్యక్రమంలో భాగంగా కేరళకు చెందిన శిక్షకులు ఉమ్మడి కర్నూలు జిల్లా న్యాయవాదులకు పారా లీగల్ వలంటీర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ ముఖాముఖి కార్యక్రమాన్ని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది సమక్షంలో నిర్వహించారు. ఈ శిక్షణలో భాగంగా న్యాయాధికారులు మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి జి. భూపాల్ రెడ్డి, ఆరో అదనపు జిల్లా జడ్జి పాండురంగారెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రితో శిక్షకులు సురేష్, జ్యోతిగోపినాథన్ ఈ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు.

మూడో రోజూ కొనసాగిన శిక్షణ తరగతులు

మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణా కార్యక్రమంలో భాగంగా బుధవారం కూడా శిక్షణా కార్యక్రమాలు కొనసాగాయి. ఈ శిక్షణలో మధ్యవర్తిత్వాన్ని ఎలా నిర్వహించాలో, వాటిలో మెలకువలను శిక్షకులు వివరించారు. ఈ శిక్షణలో భాగంగా రానున్న రోజుల్లో కోర్టు కేసుల ద్వారా కాకుండా మధ్యవర్తిత్వం ద్వారా సత్వర న్యాయం పొందడానికి వీలుండే అవకాశాలు ఉన్నాయని వారు తెలిపారు.

గద్దెరాళ్ల మారెమ్మ మహోత్సవం

అంబరాన్నంటిన జాతర సంబరాలు

7

పరీక్ష కేంద్రం తనిఖీ

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజానగర్‌లోని బిషప్ సెంట్ జోసెఫ్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్, గౌతమి నగర్‌లోని గుడ్ షెపర్డ్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లోని పది పరీక్ష కేంద్రాలను కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. పొరపాట్లకు తావు లేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభమైన పది పరీక్షల కోసం 172 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, జిల్లాలో మొత్తం విద్యార్థులు 40,776 మంది పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. బుధవారం జరిగిన పరీక్షకు 208 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ అధికారి శ్యామ్యూల్ పాల్‌ను కలెక్టర్ ఆదేశించారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

'కూలీల మృతికి కారణమైన వారిపై చర్యలు'

మహానంది, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయ పరిధిలోని నాగనంది సదనం వసతి గృహం కూల్చివేతలో ప్రమాదవశాత్తు ఇద్దరు కూలీలు మృతి చెందడం బాధాకరమని దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. బుధవారం ఆయన మహానంది ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ యర్రమల్ల మధుతో కలసి ప్రమాదం జరిగిన నాగనంది సదనం ప్రదేశాన్ని పరిశీలించారు. దేవస్థానం ప్రధాన కార్యాలయం చేరుకొని ప్రమాదానికి గల కారణాలను ఈవోతో పాటు ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులును విచారించారు. ఇందులో కాంట్రాక్టర్‌తో పాటు బాధితుల నిర్లక్ష్యం కూడా ఉందని నిర్ధారించుకొన్నారు. వీరి వెంట డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్, జిల్లా సహాయక కమీషనర్ మోహన్, గ్రూపు దేవాలయాల ఈవో హరిశ్చంద్రారెడ్డి ఉన్నారు.

పెద్దాసుపత్రిలో పాలనా వికేంద్రీకరణ

హ్యూమన్ రిసోర్స్ బాధ్యతలు కేఎంసీ ఏడీకి అప్పగింత



ఏడీలతో సమీక్ష నిర్వహిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పరిపాలనా వికేంద్రీకరణపై సూపరింటెండెంట్ అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. బుధవారం సూపరింటెండెంట్ చాంబరులో సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు హ్యూమన్ రిసోర్స్‌పై మాట్లాడారు. కర్నూలు జీజీహెచ్ ఉద్యోగుల జీతాలు, సర్వీసు వివరాలు, ఎఫ్ఆర్ఎస్ వివరాలను ఇక నుంచి కర్నూలు మెడికల్ కాలేజీ ఏడీ అనిల్ కుమార్ రెడ్డి (హ్యూమన్ రిసోర్స్) నిర్వహిస్తారన్నారు. హాస్పిటల్ ఏడీ అడ్మినిస్ట్రేటర్, ఏవో అకౌంటెంట్, సీనియర్ అసిస్టెంట్ (ఐదు మంది) బడ్జెట్‌కు సంబంధించిన వ్యవహారాలు నిర్వహిస్తారన్నారు. ఆసుపత్రి ఫైళ్లపై ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రోజు హాస్పిటల్ సూపరింటెండెంట్ కార్యాలయానికి గంట సమయం, మెడికల్ కాలేజీ ఏడీ కేటాయించాలని ఆదేశించారు. తద్వారా ఫైల్స్ త్వరగా పూర్తి అవుతాయన్నారు. ఇందులో కార్యాలయంలో ఉద్యోగుల సీట్లను మార్పు చేయాలని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకువచ్చారు. మూడేళ్లకు సీట్లు మార్చాల్సి ఉండగా.. ఏళ్ల తరబడి సీట్లలో ఉన్నారన్నారు. ఈ సమీక్షలో సీఎస్ఆర్ఎంవో డా.బీవీ రావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ ఏడీ మల్లేశ్వరమ్మ, కేఎంసీ ఏడీ అనిల్ కుమార్ రెడ్డి, ఏవో శ్రీనివాసులు, అకౌంటెంట్లు లతీఫ్ బేగ్, ఆళ్లె శ్రీనివాసులు ఉన్నారు.

ఒంటిపూట బడులను నిర్దిష్ట వేళలోనే నడపాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలో ఒంటిపూట బడులను నిర్దిష్ట వేళల్లోనే నడపాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ బుధవారం తెలిపారు. నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలను నడిపినట్లు తమ దృష్టికి వస్తే పాఠశాలల మూసివేతకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఒంటి పూట బడులకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన సమయాన్ని కచ్చితంగా పాటించాలని ఆయన ఆదేశించారు.

కృష్ణా నదిలో యువకుడి మృతి

కొత్తపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని సప్తనదుల సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో పడి సందీప్ కుమార్ (23) అనే యువకుడు మృతి చెందాడు. కొత్తపల్లి ఎస్ఐ కేశవ తెలిపిన వివరాల మేరకు.. జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామానికి చెందిన పోతురాజు మద్దిలేటి కుమారుడు సందీప్ కుమార్ అదే మండలంలోని తంగడంచ గ్రామానికి చెందిన శివకుమార్ అనే యువకుడితో కలిసి బుధవారం సంగమేశ్వరం దర్శనానికి వచ్చారు. అందులో భాగంగా ఇప్పుడిప్పుడే నది జలాల నుంచి బయల్పడుతున్న పాత సంగమేశ్వర ఆలయం పరిసరాల్లోని కృష్ణా నదిలో సందీప్ కుమార్ ఈత కొడుతూ సెల్ఫీలు తీసుకుంటూ ప్రమాదవశాత్తు నది లోతట్టు ప్రాంతాలకు వెళ్లి గల్లంతయ్యాడు. సమీపంలో తన స్నేహితుడైన శివకుమార్ గట్టిగా కేకలు వేయగా.. సమీపంలో ఉన్న మత్స్యకారులు సంగమేశ్వరం గ్రామస్థులు గల్లంతైన సందీప్ కుమార్‌ను బయటకు తీయగా అప్పటికే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ కేశవతోపాటు సిబ్బంది వెళ్లి వివరాలు సేకరించారు. మృతుని చిన్నాన్న బొజ్జన ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమ్మితం తరలించారు.

యువకుడి ఆత్మహత్య

కొలిమిగుండ్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్విమాను పల్లెలో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన రామదాసు శ్రీరాములు కుమారుడు రామదాసు మహేంద్ర(26) అనే యువకుడు అనంతపురం జిల్లా గుత్తి రేల్వే స్టేషన్ వద్ద అందరూ చూస్తుండగానే రైలు కింద తలపెట్టి అత్యంత దారుణంగా ఆత్మహత్య చేసుకున్నాడు. గత ప్రభుత్వంలో వలంటీరుగా విధులు నిర్వహించిన మహేంద్ర కొద్ది కాలంగా యాడికి మండలంలోని బోయరెడ్డిపల్లె ఆదానీ పెన్నా సిమెంట్ పరిశ్రమలో ప్యాకింగ్ విభాగంలో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం డ్యూటీ ముగించుకొని నేరుగా గుత్తికి వెళ్లి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు స్థానికులు వెల్లడిస్తున్నారు. కాగా ఆన్‌లైన్‌లో బెట్టింగ్ యాప్‌లు, ఇతర దురలవాట్ల ద్వారా తీవ్రంగా నష్టపోయిన మహేంద్ర దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది.

'స్థానిక' ఖాళీలకు ఎన్నికలు..!

5వ పేజీ తరువాయి

తుగ్గలి ఎంపీపీ పీఠం ఏకగ్రీవమేనా..?:

తుగ్గలి ఎంపీపీ పీఠం ఏకగ్రీవం అవుతుందా..? ఇక్కడా కూడా పోటీ తప్పదా..? అనే చర్చ జరుగుతున్నది. ఈ మండలంలో 17 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఎంపీపీ పీఠం బీసీ మహిళకు రిజర్వు చేశారు. తుగ్గలిలో ఓ స్థానం మినహా.. 16 స్థానాలకు టీడీపీ పోటీ చేసినా అప్పటి అధికార పార్టీ వైసీపీ నేతల దౌర్జన్యాలు, పోలీసుల బెదిరింపులతో 17 స్థానాలు ఆ పార్టీలనే దక్కించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు నుంచి వైసీపీ మండల సచివాలయ కన్వీనర్ హనుమంతు భార్య శభాష్ పురం ఎంపీటీసీ సభ్యురాలు రామాంజినమ్మ ఎంపీపీ అభ్యర్థిగా ప్రచారం చేశారు. ఎంపీపీ ఎంపికకు ముందు అనూహ్యంగా అప్పటి ఎమ్మెల్యే శ్రీదేవి సమీప బంధువు వైసీపీ నాయకుడు జగన్నాథ్‌రెడ్డి తన స్వగ్రామమైన పగిడిరాయి ఎంపీటీసీ ఆదెమ్మను తెరపైకి తెచ్చారు. దీంతో ఎంపీపీ పదవీ కాలాన్ని ఇద్దరికి రెండున్నరేళ్ల చొప్పున పంచుకొని ఒప్పందం చేసుకున్నారు. అందులో భాగంగా మొదట ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన ఆదెమ్మ రెండున్నరేళ్లు ముగిసిన వెంటనే రాజీనామా చేశారు. ప్రస్తుతం వైఎస్ ఎంపీపీ ఎర్రనాగప్ప ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగుతున్నారు. తాజాగా నోటిఫికేషన్ రావడంతో ఒప్పందం ప్రకారం వైసీపీ హనుమంతు భార్య రామాంజినమ్మ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. ఒప్పందం ప్రకారం ఎంపీపీగా ఎన్నికైతే.. ఆ పదవిలో దాదాపు ఏడాదిన్నర ఉంటారు. అయితే.. ఆ పార్టీలో ఇతరులు కూడా ఎంపీపీ పీఠం కోసం తెరవెనుక యత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

జడ్పీ కో-ఆప్షన్, ఆరు ఉప సర్పంచ్ స్థానాలకు..

కర్నూలు జిల్లా పరిషత్ (జడ్పీ) కో-ఆప్షన్ సభ్యుడిగా వెలుగోడుకు చెందిన సయ్యద్ సులేమాన్‌ను నాడు వైసీపీ జడ్పీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనారోగ్యంతో ఆయన మరణించడంతో ఖాళీ ఏర్పడింది. 53 మంది జడ్పీటీసీ సభ్యులు వైసీపీకి చెందిన వారే కావడంతో కో-ఆప్షన్ సభ్యుడి ఎన్నిక ఆ పార్టీ అభ్యర్థి ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. అలాగే.. వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న దేవనకొండ మండలం వెలమకూరు, ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లి, గుట్టపాడు, పత్తికొండ మండలం జూటూరు, ఆలూరు మండలం మొలగవల్లి, కర్నూలు మండలం నుంకేసుల ఉప సర్పంచులను ఈ నెల 27న ఎన్నుకోవాల్సి ఉంది.

గద్దెరాళ్ల మారెమ్మ మహోత్సవం

అంబరాన్నంటిన జాతర సంబరాలు



బోనాల ఊరేగింపు



ఆలయంలో మారెమ్మవ్వ

దేవనకొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : చల్లని దీవెనలతో పాడి, పంటలు, ఆయురారోగ్యాలతో చల్లంగా చూడమ్మా.. మారెమ్మా.. అంటూ భక్త జనసందోహంతో గద్దెరాళ్ల మారెమ్మ సంబరం అంబరానంటింది. బుధవారం తెల్లవారుజామున మారెమ్మవ్వకు దున్నపోతుని బలి ఇచ్చారు. దేవాలయ అధికారి వీరయ్య, గద్దెరాళ్ల గ్రామస్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు మారెమ్మకు నైవేద్యం (చల్ల)తో కూడిన బోనాలు, చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రెండేళ్లకోసారి జరిగే దేవర వేడుకకు నిర్వహించేందుకు జిల్లా నుండే కాక కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ప్రాంతాల నుండి తరలివచ్చారు. మంగళవారం సాయంత్రం నుండి అర్ధరాత్రి వరకు వాహనాల రాక గద్దెరాళ్లకు కొనసాగింది. దాదాపు లక్షన్నర జనం అమ్మవారిని దర్శించుకున్నారు. ట్రాఫిక్ సమస్య రాకుండా సీఐ వంశీనాథ్ సిబ్బందితో పర్యవేక్షించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి : కలెక్టర్



కర్నూలు కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల అంశాలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే కాకుండా అంతకుముందు కూడా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పు వంటి ఎన్నికల అంశాలపై తగిన సలహాలు, సూచనలు తీసుకొని అందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని భారత ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. ఆ మేరకు ఇకపై ప్రతి నెలా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తీసుకొని ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బూత్‌స్థాయి అధికారుల ఖాళీలు ఉంటే వాటన్నింటినీ కూడా భర్తీ చేస్తామని చెప్పారు. బీఎల్‌వోలు, ఫామ్ 6, 7, 8, 6ఏలను పరిశీలించుకుని వాటిపై అవగాహన పెంచుకోవాలని, కొత్తగా ఓటర్లను నమోదు చేయించడం, పర్మనెంట్‌గా మైగ్రేట్ అయిన వారి ఓట్లను, చనిపోయిన వారి ఓట్లను తీసివేయించడం వంటి అంశాలపై దృష్టి పెట్టే విధంగా వారికి సూచనలు ఇవ్వాల్సిందిగా రాజకీయ పార్టీలను కోరారు. ట్రాన్స్‌జెండర్ల ఓటర్ల సంఖ్య చాలా తక్కువగా ఉందని విభిన్న ప్రతిభావంతులు, సంక్షేమ శాఖ వద్ద ఉన్న ట్రాన్స్‌జెండర్ల లిస్టుతో సరిపోల్చుకుని, ఓటరు లిస్టులో లేని వారిని చేర్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి, టీడీపీ తరఫున ఎల్‌వీ ప్రసాద్, బీజేపీ తరుపున సాయిప్రదీప్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున బజారన్న, జనసేన సుబ్బయ్య పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరి మృతి



అష్రఫ్ అలీ (ఫైల్)

ఉయ్యాలవాడ/చిప్పగిరి మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉయ్యాలవాడ, చిప్పగిరి మండలాల్లో ఈతకు వెళ్లి ఇద్దరు మృతి చెందారు. ఉయ్యాలవాడ మండలంలోని నర్శిపల్లె గ్రామ సమీపంలోని కుందూ నదిలో ఈతకు వెళ్లి ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన కొత్తపల్లి అష్రఫ్ అలీ(18) మృతి చెందాడు. మృతుడు అష్రఫ్ అలీ రంజాన్ మాసం సందర్భంగా గ్రామంలోని మసీదులో నవాజు నేర్పడానికి 15 రోజుల క్రితం గ్రామానికి వచ్చి అక్కడే నివసిస్తున్నాడు. మంగళవారం గ్రామానికి చెందిన మహ్మద్‌రఫీ, దస్తగిరి, కంబగిరిస్వామితో కలిసి కుందూనదికి ఈతకు వెళ్లారు. ఈత కొడుతూ మోటర్ల కోసం ఏర్పాటు చేసిన గుంతలో ప్రమాదవశాత్తు పడి మునిగిపోయాడు. మిగతావారు గ్రామస్తులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వటంతో వారు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. బుధవారం టీడీపీ మండల కన్వీనర్ బోరెడ్డి శేఖర్‌రెడ్డి, నర్శిరెడ్డి ఉయ్యాలవాడ గ్రామం నుండి శ్రీను, గని వెంకటేశ్వర్లు, వగరు వెంకటేశ్వర్లు అనే ముగ్గురు గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. వారు మృతదేహాన్ని బయటకు తీశారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యాశాలకు తరలించారు. మృతుడి తండ్రి అహ్మద్ అలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

చిప్పగిరిలో బాలుడు..




సుభాష్ (ఫైల్)

మండల కేంద్రమైన చిప్పగిరిలోని పెద్ద బావిలో ఈతకు వెళ్లిన యువకుడు సుభాష్ (14) మృతి బుధవారం చెందాడు. ఈతకు వెళ్లిన బాలుడు బావిలో మునిగిపోవడంతో పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలింపు చేపట్టారు. చిప్పగిరి గ్రామానికి చెందిన రోషప్పగారి నాగవేణి, సత్యన్న దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ప్రథమ కుమారుడు అయిన సుభాష్ ఈతకు వెళ్లి మృతితో చిప్పగిరిలో విషాదం నెలకుంది. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ ఇజాజ్ అహమ్మద్, సీఐ శంకర్ రెడ్డి, ఎస్సై సతీష్ కుమార్ పరిశీలించారు. గుంతకల్ ప్రభుత్వం ఆసుపత్రిలో చికిత్స చేసి బంధువులకు శవాన్ని అప్పగించారు.

శ్రీశైలం డ్యాంలో తగ్గుతున్న నీటి మట్టం

ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదన



డ్యాం ముందు భాగం

సున్నిపెంట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాంలో రోజురోజుకూ నీటి మట్టం తగ్గుతోంది. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా నీటి సామర్థ్యం 215 టీఎంసీలు. బుధవారం సాయంత్రం 6గంటల సమయానికి డ్యాం నీటిమట్టం 840.10 అడుగులు కాగా, నీటి సామర్థ్యం 61.9240 టీఎంసీలుగా నమోదైంది. కుడి గట్టు విద్యుత్ కేంద్రంలో ఎలాంటి విద్యుత ఉత్పాదన జరగడం లేదు. అయితే తెలంగాణాకు చెందిన ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో అవసరాన్ని బట్టి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదన అనంతరం దిగువ నాగార్జున సాగర్‌కు డ్యాంకు 14,126 క్యూసెక్కుల నీటిని విడుదల జరుగుతోందని నీటిపారుదల అధికారులు తెలిపారు.

సునీతా విలియమ్స్‌కు శుభాకాంక్షలు

ఎంపీ బస్తిపాటి



కర్నూలు అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వెల్కమ్ టూ ఎర్త్ సునీతా విలియమ్స్ అంటూ ఎంపీ బస్తిపాటి నాగరాజు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటున్న ఆయన ఒక ప్రకటన ద్వారా స్వాగతం పలికారు. గత ఏడాది జూన్ 5న వారం రోజుల పరిశోధనల కోసం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతీ విలియమ్స్ అక్కడే చిక్కుకున్నారు. ఆమె రాక కోసం దేశ ప్రజలందరూ ఎంతో ఉత్కంఠంగా ఎదురు చూశారని, ఆమె సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో అయితే యజ్ఞం, పూజలు నిర్వహిచారని తెలిపారు. తొమ్మిది నెలల తర్వాత సునీత భూమిపైకి చేరుకోవడంతో యావత్తు దేశ ప్రజలందరూ సంతోష పడుతున్నారని ఎంపీ తెలిపారు.

రెండు ఉప సర్పంచ్ ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్

నంద్యాల, మార్చి19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న రెండు ఉప సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని డోన్ మండల పరిధిలోని కొత్త పల్లి పంచాయతీ ఉప సర్పంచ్‌గా గత ప్రభుత్వం హయాంలో పని చేసిన బడా హరాసేన్ సాహెబ్ కూటమి అధికారంలోకి రాగానే.. సదరు ఉప సర్పంచ్ పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేసి వార్డు మెంబర్‌గా కొనసాగుతున్నారు. ఇదే క్రమంలో గడివేముల మండలం పెసర వాయి గ్రామ ఉప సర్పంచ్ సాయిసుధ కూడా స్వచ్ఛందంగా రాజీనామా చేసి వార్డు మెంబర్‌గా కొనసాగుతున్నారు. దీంతో సదరు ఉప సర్పంచ్ పదవులను ఖాళీగా చూపిస్తూ జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించారు. దీంతో తాజాగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు ప్రకారం.. సదరు ఉప సర్పంచ్ పదవులకు ఈ నెల 27వ తేదీన ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉప సర్పంచ్‌లను ఎన్నుకుంటారు. కొత్తపల్లి పంచాయతీలో మొత్తం 10 వార్డులు, పెసరవాయి పంచాయతీలో 12 వార్డులు ఉండగా.. త్వరలో జరిగే ఎన్నికతో ఆయా ఉప సర్పంచ్ పదవులకు టీడీపీ మద్దతుదారులైన వార్డు మెంబర్లను ఉపసర్పంచ్‌గా మిగిలిన వార్డు మెంబర్లు ఎన్నుకునే అవకాశం ఉందని సమాచారం.

వలసల నివారణకు చర్యలు

డ్వామా పీడీ వెంకట రమణయ్య

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వలసలు నివారించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టామని డ్వామా పీడీ వెంకటరమణయ్య అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దాదాపు 90 లక్షల పని దినాలను కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఇప్పటికే 84 లక్షల పని దినాలను కూలీలకు రైతులకు కల్పించామని చెప్పారు. పనులు చేసే చోట కూలీలకు నీడ కల్పించేందుకు తార్పాలిన్లతో పాటు అందుబాటులో ఉన్న వాటిని ఏర్పాటు చేస్తున్నామని, అదేవిధంగా మంచినీళ్ల ప్యాకెట్లు పని చేసే చోట అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించినట్లు స్పష్టం చేశారు. కూలీలతోపాటు రైతులు పని చేసే సమయంలో ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జనవరి మొదటి వారం నుంచి కూలీల డబ్బులతో పాటు మెటీరియల్ ఖర్చు కింద నిధులు అందలేదని, త్వరలోనే అందుతాయని, వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామన్నారు.

ఫారంపాండ్స్ నిర్మాణానికి భూముల పరిశీలన

ఓర్వకల్లు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిచెర్ల, హుశేనాపురం తదితర గ్రామాల్లో బుధవారం జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్యతో పాటు నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, డ్వామా పీడీ వెంకటరమణయ్య భూములను పరిశీలించారు. ఈ నెల 22న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫారంపాండ్స్ నిర్మాణానికి భూమి పూజకు వస్తారన్న నేపథ్యంలో భూములను పరిశీలించారు. అయితే పూడిచెర్ల బస్టాండు సమీపంలో పూడిచెర్ల గ్రామానికి చెందిన సూర రాజన్న పొలంలో ఫారంపాండ్ నిర్మాణం కోసం భూమిని పరిశీలించారు. అయితే ఆ రైతు సానుకూలంగా స్పందించడంతో అక్కడే ఫారంపాండ్స్‌కు డిప్యూటీ సీఎం భూమి పూజ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఫారంపాండ్స్ చేపట్టాలన్న లక్ష్యంతో పవన్ కళ్యాణ్ వస్తున్నారని అధికారులు వెల్లడించారు. వీరి వెంట తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీడీ లక్ష్మన్న, ఏపీవో కుమార సాయినాథ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.



పూడిచెర్లలో భూములు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, అధికారులు

ఎరువుల అక్రమ రవాణాపై నిఘా: అగ్రి డైరెక్టర్

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రసాయన ఎరువులు పక్కదారి పట్టకుండా నిరంతర నిఘా ఉంచాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ, మార్క్ ఫెడ్ అధికారులు, రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్ అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే ఖరీఫ్ అవసరాల కోసం ఎరువులను బఫర్ స్టాక్‌ను 2లక్షల టన్నులకు పెంచనున్నట్టు చెప్పారు. ఎరువుల రవాణాలో ఖర్చులు అధికంగా ఉంటున్న విశాఖపట్నం, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాలకు మూడు రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని కేంద్రానికి సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు పంపారన్నారు. ఎరువులు సమృద్ధిగా వస్తున్నా.. కృత్రిమ కొరత, అధిక ధరలకు విక్రయం, అక్రమ తయారీ, రవాణా, వ్యవసాయేతర అవసరాలకు వినియోగాన్ని నియంత్రించాలని అధికారులను ఆదేశించారు.

27 నుంచి అగ్రి వర్సిటీలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల రైతులకు నికరాదాయం లభించేలా సాంకేతిక పరిజ్ఞానంపై ఈ నెల 27, 28, 29 తేదీల్లో గుంటూరు జిల్లా లాంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన, సదస్సు జరుగుతుందని వర్సిటీ వీసీ శారదా జయలక్ష్మి తెలిపారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ రాష్ట్రాలకు ఉపయోగపడే ఈ సదస్సులో సాంకేతిక పరికరాల ప్రదర్శనకు 300 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్టు బుధవారం చెప్పారు. కాగా పత్తి సాగు, పరిశోధనలు, భవిష్యత్ వ్యూహాలను చర్చించేందుకు ఈ నెల 21 నుంచి 23 వరకు లాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జాతీయ స్థాయి సమావేశం జరుగుతుందని లాం ఫాం అసోసియేట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పీఎం యోగా అవార్డు 2025 కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్కూరు సీఈవో వేణుగోపాల్ తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి యోగాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు అర్హులు అని ఆయన తెలిపారు. 40 ఏళ్ల వయస్సు ఉన్న 20ఏళ్లు యోగాలో అనుభవం ఉండాలన్నారు. జాతీయ స్థాయిలో వ్యక్తిగత సంస్థలు, అంతర్జాతీయ స్థాయిలో వ్యక్తిగత సంస్థల నలుగురుని ఎంపిక చేసి అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 22న అవార్డు ప్రదానం చేస్తారని తెలిపారు. ఈ నెల 31లోపు ఆన్‌లైన్ ద్వారా సెట్కూరు సీఈవో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

కన్నీటిని దిగమింగి పరీక్షకు హాజరు

తండ్రి మృతితో ఓ విద్యార్థి.. తల్లి మరణంతో మరో విద్యార్థి



పరీక్ష రాసేందుకు వచ్చిన మహమ్మద్ ముజమ్మెల్

ఆలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తండ్రి మరణంతో విషాదంలోనూ ఓ విద్యార్థికి పరీక్షకు హాజరైన ఘటన కర్నూలు జిల్లాలో జరిగింది. వివరాలివీ.. ఆలూరు పట్టణంలో జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి మహమ్మద్ ముజమ్మెల్ పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. అయితే మంగళవారం రాత్రి విద్యార్థి తండ్రి నూర్ మహమ్మద్ గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఆ ఇంట్లో విషాదం అలుముకుంది. మహమ్మద్ ముజమ్మెల్ కన్నీటిని దిగమింగుకొని పట్టణంలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ పరీక్ష కేంద్రానికి వెళ్లి బుధవారం పరీక్ష రాశాడు.

తల్లి మృతితో విషాదంలోనూ..

ఆలూరు మండలంలోని మొలగవల్లికి చెందిన విద్యార్థి శివరామకృష్ణ తల్లి శ్రీదేవి మంగళవారం హాలహర్వి మండలంలోని బాపురం సమీపంలో ఎల్లెల్సీ కాలువలో పడి మృతి చెందారు. అయితే దుఃఖంలోనూ ఆ విద్యార్థి బుధవారం ఆలూరులోని జడ్పీ బాలికోన్నత పాఠశాలకు వెళ్లి పరీక్ష రాశాడు. సాయంత్రం మహిళ అంత్యక్రియలు నిర్వహించారు.

అకౌంట్‌లో డబ్బు మాయం

వెల్దుర్తి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు అకౌంట్‌లో ఉన్న డబ్బు మాయమైన ఘటన వెల్దుర్తిలో చోటుచేసుకుంది. వెల్దుర్తికి చెందిన రేముడూరు రామిరెడ్డికి యూనియన్ బ్యాంక్‌లో సేవింగ్ అకౌంట్ ఉంది. 17వ తేదీ తన ప్రమేయం లేకుండా అకౌంట్ నుండి ఇతరులకు రూ.99 వేలు ట్రాన్స్‌ఫర్ అయింది. ఈ విషయాన్ని పసిగట్టిన రామిరెడ్డి వెంటనే యూనియన్ బ్యాంకుకు వెళ్లి తన అకౌంట్‌ను బ్లాక్ చేశాడు. బుధవారం వెల్దుర్తి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సిజేరియన్ కాన్పులు 20 శాతానికి మించకూడదు: డీఎంహెచ్‌వో



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శాంతికళ

కర్నూలు హాస్పిటల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సాధారణ కాన్పులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, సిజేరియన్ (సీ-సెక్షన్) కాన్పులు 20 శాతం మించకూడదని ప్రైవేటు హాస్పిటల్స్ యజమాన్యాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ హెచ్చరించారు. బుధవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో ప్రైవేటు హాస్పిటల్ యజమాన్యాలతో సమీక్ష నిర్వహించారు. నగరంలో సి-సెక్షన్ కాన్పులు 40 నుంచి 45 శాతం నిర్వహిస్తున్నారని, దీనిపై సి-సెక్షన్ ఆడిట్ టీంతో ఆడిట్ నిర్వహించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి నెలా 3వ తేదీలోపు కాన్పుల వివరాలను హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ పోర్టల్‌లో అప్‌లోడు చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. సమీక్షలో ఎస్‌వో హేమసుందర్ పాల్గొన్నారు.

పురందేశ్వరి పర్యటనను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కొట్టె చెన్నయ్య

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఈనెల 22న జిల్లాకు వస్తున్నారని బీజేపీ జిల్లా అధికారి ప్రతినిధి కొట్టె చెన్నయ్య, పాణ్యం ఇన్‌చార్జి రామమద్దిలేటి తెలిపారు. బుధవారం స్థానిక బుధవారపేటలోని బీజేపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ దగ్గుపాటి పురందేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 22న ఉదయం 7.30 గంటలకు అలంపూరు టోల్‌ప్లాజా వద్ద స్వాగతం పలుకుతామన్నారు. అక్కడి నుంచి నేరుగా కర్నూలు నగరంలోని బీజేపీ సీనియర్ నాయకుడు కపిలేశ్వరయ్య ఇంటికి వెళ్తున్నారన్నారు. అక్కడ అల్పాహారం విందు చేస్తారన్నారు. అనంతరం 10.30 గంటలకు ఆలూరు లో జరిగే సమావేశంలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం భోజనం అనం తరం ఎమ్మిగనూరులో మండల అధికారులతో సమీక్ష సమావేశం జరుగు తుందన్నారు పురందేశ్వరితోపాటు సంఘటన్ కార్యదర్శి మధుకర్జీ, బిట్రా నారాయణ, జిల్లా ఇన్‌చార్జి అంకాల్ రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షులు రామకృష్ణ పాల్గొంటారన్నారు.

ఈవీఎం వేర్‌హౌస్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీల ప్రతిని ధుల సమక్షంలో బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం వేర్‌హౌస్‌ను కలెక్టర్ రంజిత్ బాషా తనిఖీ చేశారు. ఈవీఎం వేర్‌హౌస్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం సంబంధిత రిజిస్ట్రర్‌లో సంతకం చేశారు. కలెక్టర్ వెంట డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ మురళి, టీడీపీ జనరల్ సెక్రటరీ ఎల్‌వీ ప్రసాద్, బీజేపీ రాష్ట్ర ఎలక్షన్ సెల్ ప్రతినిధి సాయిప్రదీప్, బీఎస్‌పీ ప్రతినిధి అరుణ్ కుమార్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రతినిధి ఎన్‌సీహెచ్ బజారన్న ఉన్నారు.

గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

సి.బెళగల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో రాణెమ్మ ఇంజనీరింగ్ సిబ్బందికి ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని ఎస్సీ, ఎస్టీలు ఇళ్లు నిర్మించుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈసమావేశంలో ఏఈ సుమంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లను వినియోగించుకోవాలి

సి.బెళగల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందజేసే వ్యవసాయ పనిముట్లను వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. బుధవారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం యాభై శాతం సబ్సి డీతో వ్యవసాయ పనిముట్లను అందజేస్తుందన్నారు. రైతులు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

26న మార్కెట్ వేలాలు

గూడూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గూడూరు నగర పంచాయతీకి సంబంధించిన మార్కెట్ వేలాలు ఈనెల 26న నిర్వహించనున్నట్లు కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. బుధవారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2025-2026 సంవత్సరానికి సంబంధించి నగర పంచాయతీకి చెందిన రోజు వారి కూరగాయల మార్కెట్, వారపుసంత మార్కెట్, గొర్రెల మాంసం మార్కెట్, గొర్రెల కబేళా, పెద్ద పశువుల మార్కెట్, పెద్ద పశువుల కబేళాకు సంబంధించిన వేలాలు ఈనెల 26న నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు సం బంధిత దస్తావేజులు, ఇంటి వాల్యువేషన్ సర్టిఫికెట్లు తీసుకురావాలని కోరారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం స్టాంటన్‌పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న గణిత ఉపాధ్యా యుడు దయానందరాజు మృతికి పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కరుణానిధిమూర్తి, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు బుధవారం సంతాపం తెలియజేశారు. దయానందరాజు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబురావు, దర్వేశ్, దామోదర్, సురేంద్ర, పవిత్రన్, శ్రీకాంత్, మరియానందం పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

సి.బెళగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పోలకల్లు గ్రామాల్లోని ఉపాధి పనులను ఎంపీడీవో రాణెమ్మ బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజు రోజుకు ఎండలు అధికమవుతున్నాయని, ఉపాధి పనులు త్వరగా ముగించుకొని ఇంటికి వెళ్లాలని కూలీలకు సూచించారు. ఆయన వెంట ఏపీవో రామన్న, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కూడళ్లలో కానరాని చలువ పందిళ్లు..



సి.క్యాంపు కూడలిలో బస్సు కోసం ఎండలో నిలబడిన విద్యార్థులు, ప్రయాణికులు

ఇబ్బంది పడుతున్న వాహనదారులు, పాదచారులు

కర్నూలు న్యూసిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నగరంలో భానుడి ప్రతాపం మొదలైంది. నగరంలోని ప్రతి కూడలిలో ప్రజలు, వాహనదా రులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నగర పాలక సంస్థ అధ్వర్యంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి. ఇప్పటికే వేసవి కాలం ప్రారంభమై ఇరవై రోజులు అవుతుంది. ఇప్పటివరకు కూడా కూడళ్లలో చలువ పం దిళ్లు ఏర్పాటు చేయడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ప్రతి ఏడాది వేసవి ప్రారంభమైన రెండు రోజులకే చలువ పందిళ్లు ఏర్పాటు చేసే వారు. ప్రస్తుతం కాలయాపన కావడంతో రాజ్‌విహార్ కూడలిలో వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద భానుడి ప్రతాపానికి బలవుతు న్నారు. అంతే కాకుండా ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న బస్‌స్టాపు, సి.క్యాంపు బస్‌స్టాపుతోపాటు కొత్తబస్టాండు, చెన్నమ్మ కూడలి తదితర ప్రాంతాలలో ఎండ వేడిమి తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోతున్నారు.



రాజ్‌విహార్ సర్కిల్‌లో..

క్యాజువాల్టీలో ఎల్లోజోన్ పనులు పూర్తి

● జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): క్యాజువాల్టీలో గత రెండు నెలలుగా కొనసాగుతున్న మరమ్మతు పనులు పూర్తయ్యాయని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం కర్నూలు జీజీహెచ్ ధన్వంతరీ హాలులో వివిధ విభాగాల హెచ్‌వోడీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స సిస్టమ్ (ఐవీఆర్‌ఎస్)లో ప్రభుత్వం వైద్యులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని సమయపాలన పాటించాలని తెలియజేసిందన్నారు. ఓపీ, క్యాజువాల్టీలో కొందరు సమయపాలన పాటించడం లేదని, ఇక నుంచి తరుచూ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. క్యాజువాల్టీ విభాగంలో అసిస్టెట్ ప్రొఫెసర్లు లేని యెడల వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్యాజువాల్టీకి వచ్చే రోగులను వెంటనే అడ్మిషన్ అయ్యే విధంగా చూసుకుని సంబంధించిన యూనిట్‌లకు షిఫ్టులు చేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఆయా విభాగాల్లో ఉండే రోగులకు సంబంధించిన ఖరీదైన మందులకు ఇండెంట్ పెట్టేటప్పుడు సంబంధించిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు సంతకం ఉండేలా చూసుకోవాలన్నారు. సమీక్షలో డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ కె.సీతారామయ్య, డి.శ్రీరాములు, కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణు కాదేవి, సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ బీవీ రావు పాల్గొన్నారు.

ముగింపు దశకు కంప్యూటీకరణ

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేసి రైతులకు తక్షణ సేవలు అందించేందుకు కంప్యూటీకరణ కార్యక్రమాన్ని ఉధృతంగా చేపట్టారు. ఇందులో భాగంగా సంఘాల కంప్యూటీకరణ ఒక సవాల్‌గా ఉమ్మడి కర్నూలు జిల్లాలో చేపట్టారు. సీఈవో విజయకుమార్, జనరల్ మేనేజర్ రామాంజనేయులు, సహకార శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు, డీజీఎంలు ఉమా మహేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, సునీల్ కుమార్‌తో పాటు ఏజీఎం త్రినాథ్ రెడ్డి తదితరులు ప్రత్యేక కమిటీలుగా ఏర్పాటై సంఘాల్లో కంప్యూటీకరణను మార్చి నెలాఖరుకు పూర్తి చేయగలిగారు. ఇప్పటికే 30 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో అన్ని అంశాల్లో పూర్తి స్థాయిలో కంప్యూటీకరణ జరిగిందని, మిగిలిన 69 సహకార సంఘాల్లో 90 నుంచి 100 శాతం కంప్యూటీకరణ పూర్తయిందని, ఏప్రిల్ నుంచి ఈ సంఘాల్లో పూపర్తిస్థాయిలో రైతులకు ఆన్‌లైన్‌లోనే సేవలు అందిస్తామని బుధవారం సీఈవో విజయకుమార్, జనరల్ మేనేజర్ రామాంజనేయులు తెలిపారు. ఇప్పటి వరకు సంఘాల్లో లావాదేవీలు ఆఫ్‌లైన్‌లోనే కొనసాగుతున్నాయని, దీని వల్ల సమస్యలు వెలువెత్తాయని వారు స్పష్టం చేశారు. ఏప్రిల్ 1 నుంచి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని, దీని వల్ల రుణాల మంజూరు, బకాయిల వసూళ్లు వెంట వెంటనే జరగడం వల్ల రైతులకు వ్యయ ప్రయాసలు తప్పుతాయనీ స్పష్టం చేశారు.

26న మున్సిపల్ కార్యాలయం ముట్టడి

కర్నూలు న్యూసిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 26న చేపడుతున్న మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తున్నట్లు సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్‌ఎండీ షరీఫ్ తెలిపారు. బుధవారం సీపీఎం అధ్వర్యంలో గౌలిగేరి, పెద్దపడఖాన, కవాడి వీధి, తెలుగుగేరిలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు.

పోస్టరు విడుదల

కర్నూలు న్యూసిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పాతబస్టాండులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద హలో మాల చలో తిరుపతి పోస్టర్లను మాల సంఘాల జేఏసీ కన్వీనర్ యాట ఓబులేసు బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ చేసి తన పంతం సాధించుకోవాలని చూస్తే మాలల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. మాధవస్వామి, నర్సప్ప, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, పెద్ద ఆనంద్, జయరాముడు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ దేవర



శకునాలలో గ్రామ దేవతకు పూజలు చేస్తున్న గౌరు వెంకటరెడ్డి

ఓర్వకల్లు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాల గ్రామంలో బుధవారం పెద్దమ్మ దేవర వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకు న్నారు. సాయంత్రం అమ్మవార్ల విగ్రహ ప్రతిమలకు మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, కేఈ ప్రభాకర్, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి పాల్గొని అమ్మవార్లకు పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు సుధాకర్ రెడ్డి, మౌళీశ్వరరెడ్డి, చంద్రపెద్ద స్వామి, మోహన్ రెడ్డి, గోవింద రెడ్డి, పెరుగు పురుషోత్తంరెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, మీదివేముల ప్రభాకర్ రెడ్డి, రంగనాథగౌడు, తిప్పన్న, పుల్లారెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, మధు, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి పథకాల పరిశీలన

సి.బెళగల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండంలోని చింతమానుపల్లె, సంగాల, తిమ్మనదొడ్డి గ్రామాల్లోని తాగునీటి పథకాలను ఎంపీడీవో రాణెమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఏఈ గోనెనాయక్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా డీఈ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని బోర్లకు, విద్యుత్ మోటార్లకు మరమ్మతులు చేయించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. వీరి వెంట ఆయా గ్రామాల సర్పంచులు ఉన్నారు.

గీతాంజలి నర్సింగ్ కళాశాలలో ఫేర్‌వెల్



వేడుకల్లో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థులతో అధ్యాపకులు

కర్నూలు హాస్పిటల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక గాయత్రీ ఎస్టేట్‌లోని గీతాంజలి నర్సింగ్ కళాశాలలో బుధవారం ఫేర్ వెల్ డేను ఘనంగా నిర్వహించారు. 2020-2021వ బ్యాచ్ నర్సింగ్ విద్యార్థులకు జూనియర్ నర్సింగ్ విద్యార్థులు వీడ్కోలు పలికారు. ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ పెరుగు విజయవర్ధన్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు వెళ్లాలన్నారు. కోర్సు పూర్తయిన విద్యార్థులకు సరిఫికెట్లు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ వసంత కుమారి, కిమ్స్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అర్చన మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులు సమాజానికి మంచి సేవలు చేసి పేరు గడించాలన్నారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు కే.సురేఖ, సింధూజ, స్వప్న, ఎస్.సురేఖ, స్వప్న, నిర్మల, సంధ్యారాణి పాల్గొన్నారు.

నేడు గోరంట్లలో శ్రీవారి రథోత్సవం

కోడుమూరు రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్లలో లక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం రథోత్సవం జరుగనుంది. బుధవారం సాయంత్రం ఉత్సవ మూర్తులను పల్లకిలో రథమండపం చేర్చారు. అక్కడ పూజారులు హోమాలు చేశారు. రథోత్సవానికి హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ తగినన్నీ బస్సులు నడపాలని గ్రామపెద్దలు తిరుమలనాయుడు, దుబ్బన్న, పరమేశ్వరనా యుడు, బాలక్రిష్ణ కోరారు.

తిరుమలలో ఎంపీపీ భర్త హఠాన్మరణం

గూడూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి వెళ్లి తిరుమలలో గూడూరు ఎంపీపీ కే సునీత భర్త ప్రతాప్ రెడ్డి బుధవారం హఠాన్మరణం చెందారు. ఈ నెల 17న తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనార్థం మిత్రులతో కలిసి తిరుమలకు వెళ్లారు. 18న స్వామి వారి దర్శనం చేసుకొని గదిలో విశ్రాంతి తీసుకున్నారు. ఉదయం మిత్రులు ప్రతాప్ రెడ్డిని లేపేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ప్రతాప్‌రెడ్డి పార్థీవదేహాన్ని తిరుమల నుంచి స్వగ్రామం చనుగొండ్లకు తరలించారు. ప్రతాప్‌రెడ్డికి భార్య ఎంపీపీ సునీతతోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రతాప్‌రెడ్డి హఠాన్మరణం పట్ల పలువురు రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు.

భోజనం షెడ్డు నిర్మించిన టీడీపీ నాయకులు

సి.బెళగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుమాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో టీడీపీ నాయకులు భోజనం షెడ్డును నిర్మించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరగౌడు, నాగమణిల కోరిక మేరకు దాతలు టీడీపీ నాయకులు తిరుమలమ్మ, వరలక్ష్మి రూ.8 లక్షలతో షెడ్డు నిర్మించారు. షెడ్డును టీడీపీ నాయకుడు పవన్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మేఘనరెడ్డి, మునిరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'ప్రశ్నార్థకంగా తెలుగు భాష మనుగడ'

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యాసంవత్సరంలో భాగంగా తప్పనిసరిగా చదవాల్సిన ద్వితీయ భాష (తెలుగు)ను ఐచ్ఛిక సబ్జెక్టుగా మార్చేందుకు చేస్తున్న సంస్కరణలతో భవిష్యత్తులో తెలుగు భాష మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని తెలుగు అధ్యాపకులు అశోక్‌బాబు, శంకర్‌రెడ్డి, చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక టౌన్ మోడల్ కళాశాలలో మూల్యాంకన శిబిరంలో తెలుగు అధ్యాపకులు నిర సన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్‌ఐవో గురువయ్యశెట్టికి తెలుగు అధ్యా పకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జోష్న, సునీత, సుమలత పాల్గొన్నారు.

దుండగులను శిక్షించాలి: ఎస్వీ



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కోడుమూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వైఎస్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను శిక్షించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. కోడుమూరు పట్టణంలోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ విగ్రహానికి నిప్పు పెట్టడంతో ఇక్కడ ఘర్షణలకు దారి తీసేలా ఉందని అన్నారు. కాబట్టి పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాదర్‌రెడ్డి, కోడుమూరు జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, వైసీపీ నాయకులు క్రిష్ణారెడ్డి, లాయర్ ప్రభాకర్, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఖాజా హుశేన్‌దాస్ స్వామి కిస్తీలు

కోడుమూరు రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కూరులో సద్గురు ఖాజాహుశేన్‌దాస్ స్వామి ఉరుసు వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం కిస్తీలు ఘనంగా జరిగాయి. భక్తులు ప్రసా దాలు తయారు చేసుకుని ఎద్దులబండ్లపై మేళతాళాలతో దర్గాకు చేర్చారు. అక్కడ దర్గా ముందున్న రాతిపాత్రలో ప్రసాదాలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు ప్రసాదం కోసం పోటీపడ్డారు. భక్తులు పీఠాధిపతి ఆశీస్సులు తీసుకున్నారు.

● **హోరాహోరీగా పొట్టేళ్ల పోటీలు:** ఖాజాహుశేన్‌దాస్ స్వామి కిస్తీలను పురస్కరించుకుని పొట్టేళ్ల పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో తక్కసీలకు చెందిన అహ్మద్ హుసేన్, వెంకటాపురానికి చెందిన శంభాజీ, ముడుమలగుర్తికి చెందిన భైరవ, యంబాయికి చెందిన జానీష్‌లకు చెందిన పొట్టేళ్లు మొదటి నాలుగు స్థానాల్లో విజేతలుగా నిలిచాయి. యజ మానులకు వరుసగా రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ. 6 వేలు, రూ 4 వేల చొప్పున నగదు బహుమతులను పీఠాధిపతి చేతుల మీదుగా అందించారు.

చేనేతలకు ఉచిత విద్యుత్‌పై హర్షం

కర్నూలు అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మరమగ్గాలకు 500 యూనిట్ల విద్యుత్ పథకంపై దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రభాకర్ రావు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని సీతారాం నగర్‌లోని సంఘం కార్యాలయంలో కుల పెద్దల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రామారావు, శ్రీహరి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కల్లూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): 36వ వార్డు పెద్దపాడులో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం న్యూసిటీ నాయకుడు టి.రాముడు కోరారు. బుధవారం వార్డు కార్యదర్శి గోపీనాథ్ ఈధ్వర్యంలో నిర్వహించిన ప్రజా చైతన్యయాత్రలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ పెద్దపాడు గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్ర మంలో శీను, ఏసురాజు, మద్దిలేటి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలకు అభినందన

కర్నూలు అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీలుగా నూతనంగా ఎన్నికైన బీటీ నాయుడు, బీద రవి చంద్రయాదవ్‌లకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్ అభినందనలు తెలిపారు. బుధవారం అమరావతిలో ఎమ్మెల్సీలు బీటీ నాయుడు, బీద రవి చంద్రయాదవ్‌ను కలిసి శాలువతో సత్కరించారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్: బైరెడ్డి



ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

ఓర్వకల్లు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌కు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మసీదులో ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ముస్లింలకు ఆయన భోజనం వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, పద్మనాభం, ఎర్రమల మద్దయ్య, గొల్ల నాగరాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.

రవాణా సేవల కోసం టెండర్లు

కర్నూలు న్యూసిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఇండియా పోస్టు వస్తువులు, రవాణా సేవల కోసం బిడ్డర్లను ఆహ్వానిస్తున్నట్లు పోస్టు మాస్టర్ జనరల్ రీజినయ్ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఈ మార్కెట్ ప్లేస్ పోర్టల్ ద్వారా ఆర్‌టీఎన్(రోడ్ ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్) వాహనాల నిర్వహణ నిమిత్తం కర్నూలు-విజయవాడ(రెండు వైపులా) తిరుపతి-కర్నూలు (రెండు వైపులా) రెండు మార్గాల్లో పోస్టల్ మెయిల్స్, పార్శిల్స్‌ను రవాణా చేసేందుకు టెండరు నోటీసులు జారీ చేశామన్నారు. అర్హత కలిగిన బిడ్డర్లు టెండర్ ప్రక్రియలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 1న చివరి తేదీ అన్నారు. మరిన్ని వివరాలకు 08518-233953కి సంప్రదించాలన్నారు.

క్రీడాకారిణికి అభినందన

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తెనాలిలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 16న జరిగిన రాష్ట్ర స్థాయి అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ సిటీ లీగ్ తైక్వాండో పోటీల్లో కర్నూలు చెందిన క్రీడాకారిణి సుగంధిని జూనియర్ అండర్-49 విభాగంలో బంగారు పతకం సాధించిందని తైక్వాండో కోచ్ జి.షబ్బీర్ హుశేన్ బుధవారం తెలిపారు. సుగంధిని జూన్‌లో జరగబోయే సౌత్ జోన్ తైక్వాండో పోటీ లకు అర్హత సాధించినట్లు చెప్పారు. ఈ పోటీ లకు ముఖ్యఅతిథిగా తెనాలి అసిస్టెంట్ కమిషనర్ వల్లూరి లక్ష్మీపతిరావు, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సలాంలు పాల్గొని క్రీడాకారిణికి బంగారు పతకాన్ని అందజేశారు.

గర్భిణులపై ప్రత్యేక శద్ధ వహించండి



మాట్లాడుతున్న డీపీఎంవో డాక్టర్ ఉమా

కోడుమూరు రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ మెంబర్ డాక్టర్ ఉమా అన్నారు. బుధవారం ముడుమలగుర్తి సచివాలయంలో మాతాశిశు సంరక్షణ సేవలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రసవం వరకు అన్ని రకాల ఆరోగ్యపరీక్షలు జరిపించాలన్నారు. డీపీవో విజయరాజు, సీహెచ్‌వో శాంత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసయాదవ్ సిబ్బంది శారద, విజయలక్ష్మి, లలిత పాల్గొన్నారు.





ఆలూరులో 5ఏళ్లుగా జాతీయ రహదారి సరిగాలేక వాహనచోదకులు, పాదచారులు అవస్థలు పడ్డారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజినేయులు, టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ చొరవతో రహదారి నిర్మాణం పూర్తయింది. ఇక వాహనాలు రయ్.. రయ్‌మని వెళుతున్నాయి. వాహనచోదుకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - ఆలూరు

నేడు పత్తికొండలో ప్రజా వేదిక

పత్తికొండ టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం మండల ఉపాధి సామాజిక తనిఖీపై ప్రజా వేదికను నిర్వహిస్తున్నట్లు ఏపీవో వెంకటేశ్వర్లు తెలిపారు. బుదవారం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఉపాధి పథకం అధికారులు, మండల పరిషత్ అధికారులు హాజరు కానున్నారనీ, ప్రజలు హాజరై అభ్యంతరాలను తెలపాలని కోరారు.

27న బార్ అసోసియేషన్ ఎన్నికలు


నామినేషన్ వేస్తున్న న్యాయవాదులు

ఆలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆలూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 27 న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి రాజేష్ నాయుడు తెలిపారు. నామినేషన్ల ప్రకియ బుధ వారం నుంచి గురువారం వరకు ఉంటుదన్నారు. 21న పరిశీలన, 22న జాబితా విడుదల ఎన్నికలు, అదే రోజు ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. అధ్యక్ష పదవికి రూ.2వేలు, కార్యదర్శి కి రూ.వెయ్యి, మిగతా పోస్టులకు రూ.500ల చొప్పున డిపాజిట్ చేయాలన్నారు. సభ్యత్వం ఉంటేనే ఓటు వేసేందుకు అర్హత ఉంటుందని తెలిపారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు


ఆదోని నెహ్రూ మెమోరియల్ పాఠశాల వద్ద విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం రెండో రోజు హిందీ (సెకండ్ లాంగ్వేజ్) పరీక్ష రాసినట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలో 16 పరీక్షా కేంద్రాలు, పెద్ద హరివాణం జడ్పీ పాఠశాల, పెద్ద తుంబలంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 3,739 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 31 గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.

సామాజిక తనిఖీలపై చర్చావేదిక


వివరాలను పరిశీలిస్తున్న అడిషనల్ పీడీ మాధవీలత

తుగ్గలి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): 2023-2024 సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల సామాజిక తనిఖీలపై బహిరంగ చర్చావేదిక బుధవారం నిర్వహించారు. తుగ్గలి ఏపీవో కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ వేదికలో అడిషినల్ పీడీ మాధవీలత పాల్గొన్నారు. మొత్తం 2,148 వర్కర్లకు గాను రూ.23 కోట్లకు పైగా ఖర్చు చేసిన వివరాలపై గత 25 రోజుల నుంచి సామాజిక బృందాలు చేపట్టిన తనిఖీల వివరాలను డీఆర్‌పీలు చదివి వినిపించారు. ఉపాధి పనులకు వలంటీర్లు వెళ్లారనీ, జాబ్ కార్డులు అప్‌డేట్ చేయలేదని ఇలా పలు సమస్యలు తెలియజేశారు. సాయంత్రానికి దాదాపు 23 గ్రామ పంచాయతీలకు గానూ 15 పంచాయతీలపై చర్చావేదిక సాగిది. ఎంపీడీవో విశ్వమోహన్, ఏపీడీ ఫక్కీరప్ప, ఏపీవోలు హేమసుందర్, రామకృష్ణ ఉన్నారు.

గ్రామాలకు విద్యార్థి బస్సు నడపాలి


ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మేకడోణ, బల్లేకల్లు గ్రామాలకు విద్యార్థి బస్సు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఉమాకాంత్ కోరారు. బుధవారం ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ రెండు గ్రామాల నుంచి ప్రతిరోజు 100 మందికి పైగా విద్యార్థులు పట్టణానికి వస్తున్నార న్నారు. సమయానికి ఆర్టీసీ బస్సు దొరకక పాఠశాలలకు వెళ్లలేక పోతున్నారని ఆవేదని వ్యక్తం చేశారు. చిరు, నవీన్, గౌస్, నాగరాజు, నరసింహ, పరమేశ్ పాల్గొన్నారు.

వర్గీకరణకు ఆమోదంపై హర్షం

మద్దికెర, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపడంపై ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పారా రాఘవేంద్ర, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆనంద్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్వీట్లు పంపిణీ చేశారు.

పవిత్ర మాసం రంజాన్


భోజనాన్ని వడ్డిస్తున్న చంద్రశేఖర్ గౌడ్

మద్దికెర, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు రంజాన్ పవిత్రమైన మాసమని తాలుకా తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాజన్న యాదవ్, కార్యదర్శి ధనుంజయుడు అన్నారు. బుధవారం మద్దికెరలోని మసీదుల్లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కులమతాలకతీతంగా అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సత్తార్, లక్ష్మీనారాయణ, టైలర్ హరి, తదితరులు పాల్గొన్నారు.

వంకాయ.. ఇదేం మాయ!

- కిలో రూ.4లు
- ఆవేదన చెందుతున్న రైతులు


మద్దికెరలో సాగుచేసిన వంకాయ

మద్దికెర, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 గ్రామాల్లో దాదాపు వెయ్యి ఎకరాల్లో వంకాయ సాగు చేశారు. దిగుబడి కూడా ఆశాజనకంగా వచ్చింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే అది ఎంతో కాలం నిలవ లేదు. ధర అమాంతం పడిపోవడంతో దిక్కుతోచడం లేదు.

ఎకరాకు రూ.20వేలు

వంకాయ సాగుకు రైతులు ఎకరాకు రూ. రూ.15 నుంచి 20వేల వరకు ఖర్చు చేశారు. విత్తనం, ఎరువులు, పురుగుమందులు ఇలా ఖర్చు చేశారు.

పడిపోయిన ధర

దిగుబడి వచ్చే సమయానికి ధర అమాంతం పడిపోయింది. రైతులకు కన్నీరు మిగిలింది. 20 కిలోల బ్యాగ్ కేవలం రూ.70 నుంచి రూ.80లు పలక డంతో ఏం చేయాలో తెలియక రైతులు అల్లాడుతున్నారు. సాధారణంగా పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కాగానే వంకాయ దరలు అమాంతం పెరుగుతాయి. ఇందుకు భిన్నంగా ఈసారి ధరలు తగ్గిపోయానని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రవాణా ఖర్చులు అదనం

దిగుబడిని గుంతకల్లు, పత్తికొండ, కర్నూలు, ఆదోనికి తరలించాలంటే రవాణా చార్జీలు భరించాల్సి ఉంటుంది. ఇక కౌలు రైతుల పరిస్థితి అగమ్య గోచకరంగా ఉంది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

20 కిలోల బ్యాగ్ రూ.80లే..



మూడెకరాల్లో వంకాయ సాగు చేశాను. వంకాయలు కోత కోసి గుంతకల్లు మార్కెట్‌కు తరలించగా.. 20 కిలోల సంచి రూ.80లకు పలికింది. రవాణా చార్జీలు, కూలీలు లెక్కిస్తే పెట్టుబడులు కూడా రావడం లేదు.

- రామాంజనేయులు, రైతు, మద్దికెర

భూ సమస్యలకు సత్వర పరిష్కారం : జేసీ


అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

ఆదోని, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే గ్రామ సభల్లో నమోదైన భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని జాయింట్ కలెక్టర్ బి. నవ్య తెలిపారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా అధికారులు, ఎమ్మిగనూరు, ఆదోని తహసీల్దార్లతో కలిసి ఫిర్యాదులను పరిశీలించారు. పట్టా భూములు ఇనాంగా నమోదవడంతో సమస్యలను క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేసి పరిష్కరించామన్నారు. ఎమ్మిగనూరు మండలం కడివెళ్ల, కందనాతి, ఆదోని మండలం కుప్పగల్, డణాపురం, నారాయణపురం గ్రామాల్లో 303 మంది రైతుల భూ సమస్యలను పరిష్కరించామన్నారు. భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని ఆదేశించారు. తహసీల్దార్లు శివరాముడు, శేషఫణి, జిల్లా అధికారులు వేణు గోపాల్ శర్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టమోటా యూనిట్ల ఏర్పాటు శుభపరిణామం

పత్తికొండ టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ ప్రాంతంలో టమెటా టమోటా ప్రాసిసింగ్ యూనిట్లను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం శుభపరిణామమని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి క్రాంతి నాయుడు పేర్కొన్నారు. బుధవారం మాట్లాడుతూ ఈ ప్రాంతంలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలకు విన్నవించింది కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. అలాగే పత్తికొండలో బీసీ బాలికల వసతి గృహం, ఏరియా ఆసుపత్రి, వృత్తి విద్యాకోర్సులు, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేసి, పరిశ్రమలు స్థాపించాలని కోరారు.

ఘనంగా దేవర


పూజలు చేస్తున్న టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్

ఆస్పరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగరడోణ మజారా గ్రామం తురవగల్లు సుంకులమ్మ, పెద్దమ్మ ఊరుదేవర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలూరు టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీపీలు కృష్ణ యాదవ్, వెంకటేష్ ఎంపీటీసీ నరసప్ప, రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, మహేష్, సిద్దు పాల్గొన్నారు.

పండ్ల తోటలతో రైతుల అభివృద్ధి

తుగ్గలి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పెంపకాలతో రైతులు అభివృద్ధి చెందుతారని నాబార్డు ఏజీఎం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బాట తండా సమీపంలో కిసాన్ మేళా నిర్వహిం చారు. గిరిజన గ్రామాల్లో నాబార్డు నిధులతో ఆబాడ్ సంస్థ సహకారంతో పండ్ల తోటలకు సబ్సిడీతో పాటు వ్యవసాయ పరికరాలు కూడా అందించామన్నారు. రైతులు మొక్కల పెంప కంలో జాగ్రత్తలు పాటించాలని అధిక మోతాదులో మందులు పిచికారీ చేయొద్దని సూచించారు. నాబార్డు అధికారులు రాఘవేంద్ర చౌదరి, ఏవో పవన్ కుమార్, శ్రీనివాసులు, సురేష్ ఉన్నారు.

భయపెడుతున్న కుక్కలు

- పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు


హొళగుందలో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

హొళగుంద, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలు చీకటి పడితే చాలు దాడులు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. చిన్నారుల నుంచి ముసలి వాళ్ల దాకా ఎవరినీ వదలడం లేదు. రెండు నెలల్లోనే 50కి పైగా కుక్కకాటు కేసులు నమోదైనట్లు పీహెచ్‌సీ వైద్యులు అంటున్నారు. పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌ను వివరణ కోరగా వీధి కుక్కలను మరో చోటుకు తరలిస్తామన్నారు.

నీడ కల్పించండి

మద్దికెర, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి, నీడ కల్పించాలని ఉపాధి కూలీలు ఏపీవో నర్సిరెడ్డిని కోరారు. బుధవారం ఏపీవో ఉపాధి పనులను పరిశీలించారు. ఏపీవో మాట్లాడుతూ ఉదయం 6 గంటలకే వచ్చి 9 గంటలలోపు ఇంటికి వెళ్లవచ్చన్నారు. పంచాయతీ వారు మజ్జిగ సరఫరా చేయాలని, వైద్యసిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. టీఏ సుధాకర్ ఉన్నారు.

అక్రమాలపై చర్యలు

చిప్పగిరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జుబేర్ అహ్మద్ హెచ్చరించారు. బుధవారం ఎంజీఎన్ఆర్జీఎస్ కార్యాలయంలో టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వలసలు వెళ్లకుండా పనులు గుర్తించి కల్పించాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనుల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని, పనులకు కూలీలు అధిక సంఖ్యలో వచ్చేలా దృష్టి సారించాలన్నారు. జాబ్ కార్డులో ఉన్న కూలీలు మాత్రమే పనులకు రావాలని సూచించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

- ఐదుగురికి గాయాలు

దేవనకొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామంలో ఉరుసుకు వచ్చి విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందగా, ఐదుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు.. ఆస్పరి మండలం, బన్నూరు గ్రామానికి మస్తాన్ వలి కుటుంబ సభ్యులతో కలసి ఉరుసుకు వచ్చారు. సాయంత్రం విద్యుత్ దీపాలకు కనెక్షన్ ఇవ్వడానికి సమీపంలోని 33కేవీ విద్యుత్ లైన్‌కు తీగలు తగలిస్తుంగా ఒక తీగ ట్రాక్టరుపై పడింది. ట్రాక్టరులో ఉన్న తంగరడోణకు చెందిన తాహెర బీ(52), మస్తాన్‌వలి, చాంద్ బాషా, హసీన, మన్సూర్, ముజ్జిమిల్ తీవ్రంగా గాయ పడ్డారు. వీరిని పత్తికొండ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో తాహెర బీ మృతి చెందింది. మిగతా వారు చికిత్స పొందుతున్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోండి

క్రిష్ణగిరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల నుంచి రూ.300లు వసూలు చేసిన క్రిష్ణగిరి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న బుధవారం డిమాండ్ చేశారు. గతంలో విచారణ చేసిన ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేదని, ఆయన అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందన్నారు

సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తేవాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే పార్థసారథి



ఆదోని, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీలో మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గుండె, కిడ్నీ, క్యాన్సర్ సమస్యలతో ఎక్కువమంది పేద, మధ్య తరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రతి వంద మందిలో 15 మందికి గుండె సంబంధిత వ్యాధులు ఉన్నాయని, కిడ్నీ జబ్బులతో ప్రైవేట్ ఆసుపత్రులను సంప్రదిస్తున్నారన్నారు. అక్కడ రూ. 10 నుంచి 25 లక్షలు పైగా వైద్యం కోసం ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన మందు వల్ల లివర్ జబ్బుతో ఆసుపత్రిలు పాలవుతున్నారు. ఆరోగ్య శాఖమంత్రి ప్రభుత్వం ఆసుపత్రులపై దృష్టి సారించి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందించాలని కోరారు.

ఫుట్‌పాత్‌పై పార్కింగ్


ఫుట్‌పాత్‌పై పార్క్ చేసిన వాహనాలు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రధాన రహదారి జీఎల్ఎఫ్ మెయిన్ రోడ్డులో ఓ దుకాణం ముందు వాహనాలు ఫుట్‌పాత్‌పై పార్క్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులకు ఈ అడ్డదిడ్డ పార్కింగ్ కనిపించలేదా? అని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం


వినతులు స్వీకరిస్తున్న గిరి మల్లేష్ గౌడ్

ఆలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ నాయకుడు గిరి మల్లేష్ గౌడ్ అన్నారు. బుధవారం ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ సూచనల మేరకు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులను వీరభద్ర గౌడ్ పరిశీలించి సంబంధిత అధికారులకు పంపుతారని తెలిపారు. కార్యక్రమంలో ఆలూరు కెనాల్ డీసీ అధ్యక్షుడు నగర డోణ కిష్టప్ప, నరసప్ప, సురేంద్ర, కొమ్ము రాజు, మసాలా జగన్, వన్నూరు వల్లి, గోవింద్, సూరి, కేశన్న, అంజిరెడ్డి, బోయ వీరేష్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ ప్రవేశాలు

పత్తికొండ టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విక్టర్ సామేల్ తెలిపారు. బుధవారం మాట్లాడుతూ 2025-26 విద్యాసంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులకు సంబంధించి ఆంగ్ల మాధ్యమంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. విద్యార్థులు మే 22లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200లు, ఎస్సీ, ఎస్టీలు రూ.150లు ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

మొండి బకాయిల వసూళ్లపై దృష్టి


నిరసన వ్యక్తం చేస్తున్న కమిషనర్, ఆర్వో

ఆదోని టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పురపాలక అధికారులు ఆస్తి పన్నుల మొండిబకాయిల వసూళ్లపై దృష్టి పెట్టారు. బుధవారం కమిషనర్ కృష్ణ, సిబ్బందితో కలిసి బకాయిదారుల వద్దకు వెళ్లి బకాయిలు చెల్లించే వరకు కదిలేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. పన్నులు వెంటనే చెల్లించాలని ప్రధాన రహదారిలోని ఏరియా ఆసుపత్రి ఎదురుగా ఉన్న విశాల్ మార్ట్ వద్ద నిరసన తెలిపారు. భవన యజమాని స్పందించని సమక్షంలో భవనంలో ఉంటున్నవారే చెల్లించాలని, పన్నులను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. మార్చి నెలాఖరులోగా టార్గెట్ రూ.14కోట్లలను వసూలు చేస్తామన్నారు. రెవెన్యూ ఆఫీసర్ నాసిర్, ఆర్ఐలు చంద్రమోహన్, శేక్షవలి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో పశుగ్రాసం పెంపకం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- హాలహర్వి ఉపాధి ఏపీవో చక్రవర్తి



హాలహర్వి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి నిధులతో పశుగ్రాసం పెంపకానికి రైతులకు భరోసా ఇస్తామని ఏపీవో చక్రవర్తి అన్నారు.

ప్రశ్న: వలసల నివారణకు చర్యలు తీసుకున్నారా?

జవాబు: వలసలు వెళ్లవని అవగాహన కల్పిస్తున్నాం. కుటుంబానికి ఉపాధి పనులు కల్పిస్తున్నాం.

ప్రశ్న: ఉపాధి కూలీలకు వేతనాలు అందడం లేదని కూలీలు ఆందోళన చెందుతున్నారు కదా?

జవాబు: రెండు నెలలుగా వేతనాలకు నిధులు రాలేదు. వేతనాలు ఇవ్వాలని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో ఖాతాల్లో నిధులు జమ చేస్తాం. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ప్రశ్న: పాడి రైతులకు ఉపాధి హామీ పథం ద్వారా ప్రయోజనం ఉందా?

జవాబు: పాడి రైతుల కోసం 41 గోకులం షెడ్లను నిర్మిస్తున్నాం. ఆసక్తిగల పాడి రైతుకు రాయితీ కింద గడ్డి పెంపకానికి, గడ్డిని కత్తిరించే పరికరాలను అందజేస్తున్నాము.

ప్రశ్న: గత ప్రభుత్వ హయాంలో ఉపాధి నిధులతో చేపట్టిన సచివాలయ భవనాల నిర్మాణాలు ఆగిపోయాయి కదా. వాటి పరిస్థితి ఏంటి?

జవాబు: గత ప్రభుత్వంలో చేపట్టిన సచివాలయాల నిర్మాణాలకు నిధులు రాలేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు వస్తే పనులు పూర్తి చేస్తాం.

ప్రశ్న: ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా?

జవాబు: ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం మా పరిధిలో లేదు. ఎలాంటి ఒత్తిళ్లు వచ్చిన మేము జోక్యం చేసుకోవడం లేదు.

ప్రశ్న: పల్లె పండుగ నిధులు రాలేదని కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. బిల్లులు రాకపోవడానికి కారణాలు ఏంటి?

జవాబు: పల్లె పండుగ నిధులు రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ ఉన్నాయి. వారం రోజుల్లో అందరికీ బిల్లులు వస్తాయని తెలిసింది.

భవన నిర్మాణాలను పూర్తి చేయాలి



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

గోనెగండ్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిఉదయ్, గోనెగండ్ల మండల అధ్యక్షుడు పవన్‌తేజ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో వేముగోడు, పుట్టపాశం, హెచ్ కైరవాడి, కులుమాల, చిన్నమరివీడు గ్రామాలలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పర్యటించి అసంపూర్తిగా నిలిచిన భవనాలను పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు గ్రామాలలో విద్యార్థులకు సరిపడు గదులు లేకపోవడంతో ఆరుబయట, చెట్ల కింద చదువుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ పనులను పూర్తి చేసి భవనాలను అందుబాటులోకి తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వినయ్, విక్రమ్, అన్నమయ్య పాల్గొన్నారు.

శ్రీమఠానికి బంగారు నాణేలు విరాళం

మంత్రాలయం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన పీఎస్ శ్రీనివాస్ అనే భక్తుడు 32 గ్రాముల బంగారు నాణేలు విరాళంగా ఇచ్చినట్లు ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్ తెలిపారు. కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని నాలుగు బంగారు నాణేలు విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబ సభ్యులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు , పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో గిరిధర్, శ్రీపాధాచార్, జేపీ స్వామి, వ్యాసరాజాచార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు ట్రాక్టర్లకు అనుమతి

మంత్రాలయం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సీఎంఏవై అర్బన్, ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం కింద ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలకు ఉచిత ఇసుక రవాణా చేసేందుకు ఆరు ట్రాక్టర్లకు అనుమతి ఇచ్చినట్లు తహసీల్దార్ ఎస్.రవి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే ఉచిత ఇసుక రవాణా చేసేందుకు అనుమతి ఇచ్చామన్నారు. ఎవరైనా ఇసుకను లాడ్జీలకు, దుకాణాలకు పెద్ద భవంతులకు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేకుండా తుంగభద్ర నది నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

కోసిగి ఎస్‌ఐగా హనుమంతరెడ్డి

కోసిగి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కోసిగి ఎస్‌ఐగా జి. హనుమంతరెడ్డి బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు కోసిగిలో పని చేస్తున్న ఎస్‌ఐ చంద్రమోహన్‌ను కర్నూలు త్రీటౌన్ యూపీఎస్‌కు బదిలీ అయ్యారు. నూతన ఎస్‌ఐ హనుమంత రెడ్డి మాట్లాడుతూ కోసిగిలో శాంతిభద్రతల కోసం కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో అల్లర్లకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఎస్‌ఐకి పలువురు రాజకీయ పార్టీల నాయకులు కలిసి అభినందనలు తెలియజేసి పూలమాలలు శాలువలతో సత్కరించారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

గోనెగండ్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షలను బుధవారం పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు అబ్రహాం పరిశీలించారు. గోనెగండ్ల మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలలో 625 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 615 మంది హాజరయ్యారు. పది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

గోనెగండ్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం అలాగే 7,8,9,10,12 తరగతులలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో నీలకంఠ కోరారు. దరఖాస్తులను ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అనాథలు, బడిబయట ఉన్న పిల్లలు, డ్రాపౌట్, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మోటారు సైకిల్ చోరీ.. కేసు నమోదు

మంత్రాలయం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో తుంగభద్ర నదితీరం సమీపంలో పంచముఖి దర్శన్ దగ్గర మంత్రాలయం చెందిన ఆఖలి ఆది అనే వ్యక్తికి చెందిన మోటారు సైకిల్ చోరీకి గురైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మంత్రాలయం హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల మేరకు గత నెల 17న మోటారు సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. పలుచోట్ల గాలించారు. అయినా మోటారు సైకిల్ దొరక్కపోవడంతో బుధవారం మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ సమీపంలోని హనుమాపురం దగ్గర 164 జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎమ్మిగనూరు ఎస్సీ కాలనీకి చెందిన మారెప్ప(24) బైక్ మెకానిక్‌గా జీవనం సాగిస్తుండేవాడు. పని ముగించుకొని తన స్నేహితుడిని హనుమాపురంలో వదిలాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా అటుగా వచ్చిన గ్యాస్ లారీని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు న్యాయం చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

మంత్రాలయం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో రైతులకు న్యాయం చేయాలని సీపీఐ నాయకులు కోరారు. బుధవారం రైతులతో కలిసి తహసీల్దార్ ఎస్.రవికి వినతి పత్రం అందజేశారు. కొత్త ప్రభుత్వం చేపట్టిన సర్వేలో ఇనామ్ భూములు, అనుభవం కింద ఉన్న భూములను పరిశీలించి రైతులకే చెందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గాబ్రియేల్, పంపాపతి, బీపీ మస్తాన్, లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- గుంత రోడ్డులో ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

కోసిగి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంత పడి ప్రమాదకరంగా మారింది. రోజూ రోడ్డు ప్రమాదాలకు గురవుతూ వాహనదారులు ఆసుపత్రుల పాలవుతున్నారు. గతంలో ఆర్టీసీ బస్టాండులో వర్షం నీరు నిల్వ చేరి చెరువు కుంటలా తయారవుతుండటంతో గత వైసీపీ ప్రభుత్వంలో ప్రధాన రోడ్డును తవ్వి కల్వర్టు ఏర్పాటు చేసి కాలువను ఏర్పాటు చేశారు. అయితే.. అక్కడ సిమెంటు రోడ్డు వేయకపోవడంతో మట్టి రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలిసినా కూడా గుంతలు పడ్డ రోడ్డును బాగు చేయడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాళ్లు తేలి ప్రమాదకరంగా రెండు నుంచి మూడు అడుగుల మేర గుంత పడటంతో ఆ రోడ్డుపై వెళ్లి వచ్చే వాహనదారులు గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి ఉరుకుందకు వెళ్తున్న ఓ వాహనదారుడు గుంతను గమనించక అదుపుతప్పి కింద పడటంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు.



కోసిగి ఆర్టీసీ బస్టాండు ముందు రోడ్డుపై ఉన్న గుంత

వారిని స్థానికులు కోసిగి ఆసుపత్రికి తరలించారు. ఆదివారం కూడా కూలీల ఆటో అధిక లోడుతో వెళ్తుండటంతో వెనుక చక్రాలు గుంతలో ఇరుక్కుపోయి ఆటో ఓవైపు ఒరిగిపోవడంతో ప్రయాణికులు గట్టిగా కేకలు వేయడంతో పక్కనే ఉన్న వారు గమనించి ఆటోను గట్టెక్కించారు. ఇలా నిత్యం ఆర్టీసీ బస్టాండు ముందు రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిందని, బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలు పడ్డ రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

వైభవంగా సుయతీంద్రతీర్థుల మధ్యారాధన

మంత్రాలయం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతి సుయతీంద్రతీర్థుల 12వ మధ్యారాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. బుధవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో బంగారు రథంపై సుయతీంద్ర తీర్థుల చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు, హారతుల ఇచ్చారు. అనంతరం రథం ముందుకు సాగింది. భజనలు, కోలాటాలు, చండీ వాయిద్యాలతో మఠం ప్రాంగణం మార్మోగింది. అంతకుముందు సుయతీంద్రతీర్థుల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, పుష్పాలు, బంగారు, వెండి ఆభరణాలతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మంత్రాలయం పీఠాధిపతితో పాటు మత్తూరు మఠం పీఠాధిపతి బోధానంద సరస్వతి స్వామీజీతో కలిసి బృందావనానికి హారతులు ఇచ్చారు. అనంతరం యాగశాలలో పండితులు రచించిన పుస్తకాన్ని పీఠాధిపతి ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత పండిత కేసరి విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, ఎస్ఎన్ వెంకటేశాచార్, ఎస్ఎన్ రఘునందనాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేశ్ జోషి, సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, ఏఈ బద్రినాథ్, ద్వారపాలక అనంత స్వామి, సుధీంద్రాచార్, వ్యాసరాజాచార్, రవి కులకర్ణి, జేపీ స్వామి, అనంతపురానిక్ పాల్గొన్నారు.



బంగారు రథంపై స్వామి వారి ఊరేగింపు

● **అలరించిన దాసవాణి సాహిత్యం:** సుయతీంద్రతీర్థుల మహారాధనలో భాగంగా బుధవారం యాగశాలలో నిర్వహించిన దాసవాని సాహిత్యం భక్తులను అలరించింది. బెంగుళూరు చెందిన రాయచూరు శేషగిరిదాస్ దాసవాణి సాహిత్యం, హుబ్లీకి చెందిన విద్వాన్ శ్రీహరిఆచార్ వాలేఖర్, బెంగుళూరు చెందిన విద్వాన్ తిరుమలాచార్ కులకర్ణి ప్రవచనాలు వినిపించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సోమప్ప సర్కిల్‌లో మాట్లాడుతున్న ప్రభాకర్

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రవాణా రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కే ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆటో యూనియన్ సీఐటీయూ, ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ యూనియన్ ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్‌లో ఆటో కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన కొత్త చట్టాలతో రవాణా రంగం ఇబ్బందుల్లో పడిందన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వచ్చేనెల 24న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు మహబూబ్, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, నరసింహులు, రాఘవేంద్ర, బడేసాబ్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: రవాణారంగ పరిరక్షణకు వచ్చేనెల 24న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. బుధవారం కోసిగిలో రవాణ రంగ పరిరక్షణకు జీపుజాత నిర్వహించారు. కోసిగి ఆర్టీసీ బస్టాండు ముందు సీఐటీయు ఆధ్వర్యంలో డ్రైవర్లు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా నాయకులు నాగరాజు, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, రైతు సంఘం మండల కార్యదర్శి ఈరేష్, ఆటో యూనియన్ నాయకులు వెంకటేశ్, మురళి, చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకరావాలి

కౌతాళం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉరుకుంద గ్రామంలో ప్రభుత్వం రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకరావాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ఈరన్న, సీనియర్ నాయకుడు మల్లయ్య మాట్లాడుతూ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి సుదూర ప్రాంతాల నుంచి నిత్యం భక్తులు వస్తుంటారన్నారు. బస్టాండ్‌లో బస్సులు నిలుపకపోవడంతో రోడ్డుపైనే భక్తులు దిగుతూ ఇబ్బందులకు గురైతున్నారు. ఆర్టీసీ అధికారులు బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

టీడీపీతోనే దళితుల అభివృద్ధి

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు నాయకుల క్షీరాభిషేకం



సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

ఎమ్మిగనూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): దళితుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని టౌన్‌బ్యాంకు డైరెక్టర్ షాలేమ్, ఏడో వార్డు టీడీపీ ఇన్‌చార్జి నాయకంటి అంబేడ్కర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు మంత్రి మండలి ఆమోదం తెలపటంతో ఎమ్మిగనూరు ఎస్సీ కాలనీలో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి చిత్రపటాలకు టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు, స్థానికులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు నరసింహుడు, రాఘవేంద్ర, శ్యాము, రాజు, నీలమ్మ, మద్దినమ్మ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

నందవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారుడు ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు కోరారు. బుధవారం నందవరంలోని తహసీల్దార్ కార్యాయలంలో రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు ఈకేవైసీ చేయించుకోనివారు 7836 మంది ఉన్నారని, ఇందులో చిన్నపిల్లలు, పెద్ద వారు కూడా ఉన్నారని తెలిపారు. ఈకేవైసీ చేయించుకొని రేషన్ డీలర్లుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పలు గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



సోమప్ప సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని కేవీపీఎస్ మండల అధ్యక్షుడు తిమ్మప్ప, కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుమాల ఆంథోని అన్నారు. బుధవారం సోమప్ప సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డప్పు కళాకారుల పెన్షన్ సమస్యలను పరిష్కరించాలని, ఇతర కళాకారుల మాదిరిగా రూ. 7500 పించన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాముడు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

గోనెగండ్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అధికారుల అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ తెలిపారు. బుధవారం సీఐ మాట్లాడుతూ గోనెగండ్ల స్టేషన్ సీఐ కొత్తగా చార్జీ తీసుకున్నానని తెలిపారు. గోనెగండ్ల మండలంలో ప్రభుత్వం గుర్తించిన ఇసుక రీచ్ లేదని ఈ ప్రాంతంలో ఉన్న వారు ఇసుక కావాలంటే కోసిగి మండలం గుడి కంబాల నుంచి అధికారుల అనుమతితో తీసుకోవచ్చన్నారు. అంతేగాని హెచ్ కైరవాడి, గంజహళ్లి, తిప్పనూరు, వేముగోడు, పుట్టపాశం, గ్రామాల దగ్గర ఉన్న హంద్రీనదిలో ఇసుకను తరలించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం రాత్రి గంజహళ్లి హంద్రీనది దగ్గర అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశామని తెలిపారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండీ అంజిబాబు

మంత్రాలయం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రోజు రోజుకు తాగునీటి సమస్య తీవ్రతరమవుతుందని, వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. బుధవారం మంత్రాలయం మండలంలోని మాధవరం, చెట్నహళ్లి, మంత్రాలయం గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగభద్ర నదీతీర గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. సమస్యను పరిష్కరించకపోతే ఈ నెల 24న మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జయరాజు, నాయకులు మారెప్ప, సురేష్,



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

తిక్కన్న, ప్రాణేష్, ఆంద్రయ్య, అంజి, లక్ష్మన్న, ఇజ్రాయేల్, వీరేష్, గోవిందు, తిమ్మోతి, సామేల్ పాల్గొన్నారు.

అసౌకర్యంగా ఉన్న బెంచీలపై పరీక్షలు

- ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్



పది పరీక్ష హాలులో విరిగిపోయిన బెంచీని చూపిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కోసిగి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండల కేంద్రంలో పదవ తరగతి పరీక్షల కోసం ఏర్పాటు చేసిన బెంచీలు విరిగిపోయి అసౌకర్యంగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వీరేష్ అన్నారు. బుధవారం కోసిగిలోని బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో విరిగిపోయిన బెంచీలు, పెద్ద రంధ్రాలు పడివున్న బెంచీలును చూసి ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించాల్సిన విద్యాధికారుల నిర్లక్ష్యం కారణంగా పదవ తరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు ఇప్పటికైనా విరిగిపోయిన బెంచీల స్థానంలో మంచి బెంచీలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు దివాకర్, ముని, రాఘవ్, అరవింద్, మల్లికార్జున, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి ఎం.సత్యన్న



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్వర్యంలో వచ్చేనెల 21,22,23తేదీల్లో మహారాష్ట్రలో నిర్వహించనున్న జాతీయ మూడవ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి ఎం.సత్యన్న పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలరాజు, రాజన్న, బొజ్జప్ప, దేవరం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలను త్వరగా పూర్తి చేయాలి

అడిషనల్ డీఎంహెచ్‌వో సత్యవతి



రికార్డులను పరిశీలిస్తున్న సత్యవతి

గోనెగండ్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సర్వేలను వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, సిబ్బంది త్వరగా పూర్తి చేయాలని అడిషనల్ డీఎంహెచ్‌వో సత్యవతి ఆదేశించారు. బుధవారం గోనెగండ్లలోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రతిరోజు ఓపి ఎంత ఉంటుంది. రెగ్యులర్ రోగులు ఎంత మంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రిలోని గదులను, స్టోర్‌రూమ్, వార్డు గదులను, ఇతర గదులను ఆమె పరిశీలించారు. రోగులకు వైద్యం సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు రంగా రవళి, రజిని, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కన్నడ భక్తులకు అన్నదానం



కన్నడ భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు

కోసిగి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని సుమారు 750 కిలోమీటర్ల దూరం నుంచి కన్నడ భక్తులు పాదయాత్రగా శ్రీశైలానికి కోసిగి మీదుగా వెళ్తున్నారు. వీరికి కోసిగి మండలంలోని ఆర్లబండ గ్రామంలో కురువ దత్తాత్రేయ కుటుంబం వారు 11 సంవత్సరాల నుంచి కన్నడ భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. బుధవారం కూడా పెద్ద ఎత్తున కన్నడిగులకు అన్నదానం నిర్వహించారు. అలాగే కోసిగిలో పలు చోట్ల కన్నడ భక్తులకు దాతలు సేవా దృక్పథంతో అన్నదానం, పండ్లు, మజ్జిగ, నిమ్మరసం వంటివి అందజేశారు. కొందరు కన్నడ భక్తులు కాళ్లకు ఐదడుగుల కట్టెలు కట్టుకుని మొక్కుబడిలో భాగంగా పాదయాత్రగా శ్రీశైలానికి వెళ్ళి భక్తిని చాటుకుంటున్నారు. ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా ఓం నమశ్శివాయ నామస్మరణతో ముందుకు వెళ్తున్నారు.